KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :53 | గురువారం , 23 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-







# టాలీవుడ్ పై ఐటి పంజా




(శ్రీధర్ యాలాల - సీనియర్ జర్నలిస్ట్)

- చిత్ర పరిశ్రమలోని బడా నిర్మాతల ఇళ్లపై ఐటీ దాడులు
- ఐటీ సోదాల్లో కీలక అంశాలు వెలుగులోకి
- పన్నులు కట్టకుండా నగదు లావాదేవీలు నిర్వహణ
- పుష్ప 2 మూవీ బాక్స్ ఆఫీస్ వద్ద భారీ లాభాలు
- వసూళ్ల తగ్గట్టుగా ఐటీ చెల్లింపులు జరగలేదు
- ఎస్‌వీసీ, మైత్రి, మ్యాంగో మీడియా సంస్థల్లో తనిఖీలు
- దిల్ రాజు, కుమార్తె హన్సితా రెడ్డి, సుకుమార్ ఇళ్ళలో కూడా రైడ్స్
- దిల్ రాజు భార్య తేజస్వినిని తీసుకెళ్లి బ్యాంకు లాకర్లు ఓపెన్ చేయించిన అధికారులు
- కీలక డాక్యుమెంట్స్ స్వాధీనం
- టాలీవుడ్ లో బ్లాక్ మనీ గుట్టు అంతా బయటకు వస్తుందా?

తెలుగు చిత్ర పరిశ్రమలోని బడా నిర్మాతల ఇళ్లపై ఐటీ దాడులు చర్చనీయాంశం అవుతున్నాయి. ఐటీ రెయిడ్స్ ఎంత పకడ్బందీగా చేస్తారో సినిమాల్లో చూపిస్తారు. కానీ ఇప్పుడు ఆ నిర్మాతలు స్వయంగా చూస్తున్నారు. రెండు వందల మందికిపైగా అధికారులు ఒక్క సారిగా ఎలాంటి సమాచారం లేకుండా రెయిడ్ కి వచ్చేశారు. దీంతో సర్దుకోవడానిక కూడా నిర్మాతలకు ఏ అవకాశం లేకుండా పోయింది. ఐటీ అధికారులు సంపూర్ణమైన సమాచారాన్ని సేకరించిన తర్వాతే దాడి చేశారని వారు సోదాలు చేస్తున్న వ్యక్తులను బట్టి అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. టాలీవ్డ ఆర్థిక వ్యవహారాలపై పూర్తి స్థాయి సమాచారంతోనే ఐటీ అధికారులు రంగంలోకి దిగినట్లుగా తెలుస్తోంది. పెద్దగా బయటకు తెలియని అత్యధిక లావాదేవీలు చేసే వ్యక్తులనూ వదిలి పెట్టకుండా సోదాలు చేస్తున్నారు.

రామ్ చరణ్‌తో బుచ్చిబాబు సానా దర్శకత్వంలో సినిమా చేస్తున్న నిర్మాత సతీష్ గురించి బయట పెద్దగా తెలియదు. కానీ ఆయన బడా ఆర్థిక వ్యవహారాలను నడుపుతూ ఉంటారని ఆయనకు రియల్ ఎస్టేట్ కంపెనీ కూడా ఉందని ఇండస్ట్రీలో కొంత మందికి తెలుసు. మైత్రీ మూవీకమ్స్ లో ఆయన ఓ పార్టనల్. ఆయన ఇంటిపై కూడా ఐటీ రెయిడ్స్ జరుగుతున్నాయి. ఇక పెద్దగా సినిమాలు తీయని.. డిజిటల్ సినిమా కంటెంట్ క్రియేషన్ లో ఉన్న మ్యాంగో మీడియా యజమాని రాము ఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. ఆయన దిల్ రాజు కు పెద్ద మొత్తంలో నగదు సమకూరుస్తారన్న ప్రచారం ఉంది. అలాగే సినీ ఇండస్ట్రీలో పెద్ద ఫైనాన్షియర్ గా ఉన్న సత్య రంగయ్య ఆఫీసుల్లోనూ సోదాలు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి - కేటీఆర్




బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితినే కాదు.. భారత రైతు సమితి కూడా అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో విసుగు చెంది ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలతో పాటు మిగతా అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ఎల్లుండి నుంచి బీఆర్ఎస్ అధ్యయన కమిటీ జిల్లా పర్యటనలు చేస్తుందని కేటీఆర్ తెలిపారు. అధ్యయన కమిటీ చైర్మన్ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అధ్యక్షతన మంచిరేవులలోని ఆయన నివాసంలో ఈ సమావేశం జరగ్గా.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. సమావేశం ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

# హైదరాబాద్‌లో హెచ్ సీఎల్ కొత్త టెక్ సెంటర్

తెలంగాణ ప్రభుత్వం దావోస్ లో మరో కీలక ఒప్పందం చేసుకుంది. అటు రాష్ట్రానికి పెట్టుబడులతో పాటు ఇటు యువతకు మెరుగైన ఉద్యోగావకాశాల కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర బృందం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్?సీఎల్ హైదరాబాద్ లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలంగాణ పెవిలియన్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సి.విజయకుమార్‌తో తాజాగా చర్చలు జరిపారు.




# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఈటెల ఫిక్స్..?

తెలంగాణలలో బీజేపీ బీసీ మంత్రాన్నే నమ్ముకుంది. గత ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి నినాదం కలిసి రాకపోయినా.. ఆ వర్గాన్ని ఓన్ చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. అందులో భాగంగా ఈటెల రాజేందర్‌కు రాష్ట్ర బీజేపీ పగ్గాలు అప్పజెప్పాలని ఢిల్లీ పెద్దలు ఫిక్స్ అయ్యారంట. ప్రస్తుతం ప్రెసిడెంట్ పదవి కోసం పోటీ పడుతున్న వారితో పోలిస్తే ఈటల బెటర్ అని కాషాయ పెద్దలు భావిస్తున్నారంట. అధ్యక్షుడు కావడానికి ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ అవసరం లేదంటూ తాజాగా కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఈటల నియామకం దాదాపు కన్‌ఫర్మ్ అయినట్లే అంటున్నారు.

తెలంగాణ కాషాయ రథసారథిగా మల్కాజ్‌గిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ఎంపిక దాదాపు ఖరారైదంట. ఈ నెలాఖరు లోపే దానిపై అధికారిక ప్రకటన, ఈటెల పగ్గాలు చేపట్టడం ఖాయమంటున్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు దాదాపు పూర్తవుతున్న క్రమంలో కీలకమైన రాష్ట్ర అధ్యక్ష పదవి ఖరారుపై జాతీయపార్టీ దృష్టి సారించింది. ఈటల సారథ్యంపై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారంట. గతంలోనే ఈటెలకు కీలక బాధ్యతలు అప్పగిస్తామని షా మాట కూడా ఇచ్చారు. అయితే బండి సంజయ్, ఈటెల మధ్య గ్యాప్‌తో లోక్‌సభఎన్నికలకు ముందు ఈటెలకు పగ్గాలు ఇవ్వడానికి అధిష్టానం సాహసించలేదంట. అందుకే మధ్యే మార్గంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మళ్లీ రాష్ట్ర పగ్గాలను అప్పజెప్పిందంటారు.




# ముగ్గురు సీఎంల రౌండ్ టేబుల్ భేటీ




దావోస్‌లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య రౌడ్ టేబుల్ మీటింగ్ జరిగింది. ఈ చర్చల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొన్నారు. రాష్టాల అభివృద్ధి, టెక్నాలజీ ప్రగతి, దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లపై వారు ప్రధానంగా చర్చించారు.

5లో

## బీజేపీకి మద్దతు ఉపసంహరించుకున్న బీహార్ సీఎం




## నేటిమాట

తిట్టేవాడికి దగ్గరున్నా పర్లేదు
కానీ పొగిడేవాడికి మాత్రం
దూరంగా ఉండండి..!!



-కాళోజీ

# గాంధీభవన్ లో కొట్టుకున్న యూత్ కాంగ్రెస్ నేతలు




హైదరాబాద్ గాంధీ భవన్‌లో బుధవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గాంధీ భవన్ వేదికగా జరిగిన యూత్ కాంగ్రెస్ సమావేశం రసాభాసగా మారింది. యూత్ కాంగ్రెస్ నేతలు రెండు వర్గాలుగా చీలిపోయి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఇరు పక్షాల నేతలు బాహాబాహీకి దిగారు. యూత్ కాంగ్రెస్‌లో పదవుల కోసమే ఇరు వర్గాల నేతలు కొట్టుకున్నట్లు సమాచారం. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని కొత్తగూడెం యూత్ కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. ఘర్షణకు దిగిన ఇరు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు. బుధవారం గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పదవుల విషయంలో కొత్తగూడెంకు చెందిన నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయగా అది రెండు వర్గాల మధ్య వాగ్వాదానికి దారితీసింది. అది కాస్తా మరింత ముదిరి వివాదంగా మారింది.

# మా జోలికి వస్తే కబడ్దార్

కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ నీటిని కాకుండా మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న పేదల ఇళ్లను ప్రక్షాళన చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. మూసిని గోదావరితో అనుసంధానం చేయడానికి 1700 కోట్లతో కేసీఆర్ ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. మళ్లీ రూ.7500 కోట్లతో మల్లన్న సాగర్ నుంచి నీళ్లు తీసుకురావడానికి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. మూసీని ఏటీఎంగా మార్చుకొని వచ్చిన డబ్బులను ఢిల్లీ పంపిస్తున్నారని ఆరోపించారు.




## దమ్ముంటే రేవంత్ రెడ్డి గ్రామ సభలకు రావాలి - హరీశ్ రావు




## హైడ్రా కూల్చివేతలకు దానం అడ్డు..

రేవంత్ రెడ్డితోనే తేల్చుకుంటా




## కొత్త రేషన్ కార్డులతో 40 లక్షల మందికి లబ్ధి..

మంత్రి ఉత్తమ్




## మహారాష్ట్రలో ఘోర రైలు ప్రమాదం

8 మంది మృతి, 40 మందికిపైగా గాయాలు



# టాలీవుడ్ పై ఐటి పంజా

## పక్క సమాచారంతోనే..

మొదటి పేజీ తరువాయి

అంటే టాలీవుడ్ కు సంబంధించి పూర్తి స్థాయిలో .. ఆర్థిక పరమైన లావాదేవీలు ఎలా జరుగుతాయో



తెలుసుకున్న తర్వాతనే అతి భారీ ఆపరేషన్ ను ఐటీ అధికారులు ప్రారంభించారని అనుకోవచ్చు. సోదాలు ఆషామాషీగా జరగడం లేదని .. దిల్ రాజు ఇంట్లో నిర్వహిస్తున్న సోదాలతో వెల్లడవుతోంది. దిల్ రాజు భార్యను ప్రత్యేకంగా బ్యాంకుకు తీసుకెళ్లారు. లాకర్లలో ఏముందో పరిశీలించే అవకాశం ఉంది. పుష్ప సినిమా అత్యధిక కలెక్షన్లను వసూలు చేసింది. వీరంతా పన్నులు కట్టకుండా నగదు లావాదేవీలు నిర్వహిస్తున్నారన్న అనుమానాలతో ఐటీ రెయిడ్స్ జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

మంగళవారం తెల్లవారుజాము నుంచి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి సహా పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. మైత్రీ నవీన్, సిఇఒ చెర్రీ, మైత్రి సంస్థ భాగస్వాముల ఇళ్లల్లో సోదాలు జరుగుతున్నాయి. అటు మ్యాంగో మీడియా సంస్థ లోకూడా సోదాలు జరుగుతున్నాయి. సింగర్ సునీత భర్త .. రాము కు సంబంధిన సంస్థ మాంగోపై దాడులు కొనసాగుతున్నాయి. దిల్ రాజు, మైత్రీ మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థలపై నేటి ఉదయం నుంచి ఐటీ దాడులు జరుగుతున్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలిలో కార్యాలయాలపైన, ఇళ్లలోనూ సోదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో 8 చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు ఐటీ అధికారులు.

### వసూళ్లు తగ్గట్టుగా ఐటీ చెల్లింపులు లేవు

ఐటీ సోదాల్లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్వాహకులు రవిశంకర్, నవీన్‌లను ఐటీ అధికారులు విచారించారు. పుష్ప 2 మూవీ బాక్స్ ఆఫీస్ వద్ద భారీ లాభాలు రాబట్టినట్లు ఐటీ గుర్తించింది. వసూళ్లు తగ్గట్టుగా ఐటీ చెల్లింపులు జరగలేదని ఐటీ నిర్ధారణకు వచ్చింది. మైత్రి మూవీ మేకర్స్ బ్యాంక్ లావాదేవీలను ఇన్‌కంటాక్స్ అధికారులు పరిశీలిస్తున్నారు. దిల్ రాజ్ ఇల్లు, కూతురు హన్సితా రెడ్డి, సోదరుడు నర్సింహ రెడ్డి, నిర్మాత శిరీష్ ఇంట్లో సోదాలు కొనసాగుతున్నాయి. భారీ బడ్జెట్ మూవీ గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం రెండు మూవీల ఆదాయ వ్యయాలపైనా ఐటీ విచారణ చేస్తోంది. సంక్రాంతికి వస్తున్నాం మూవీ వారం రోజుల్లో రూ.203 కోట్లు వసూళు చేసినట్లు గుర్తించారు. వచ్చిన లాభాలకు చెల్లించిన పన్నులకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు ఐటీ శాఖ గుర్తించింది. మరోవైపు పుష్ప 2 చిత్ర దర్శకుడు సుకుమార్ ఇంట్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. పుష్ప 2 నిర్మాణంలో సుకుమార్‌కు షేర్లు ఉన్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు.

దిల్‌రాజు కుమార్తె హన్సితా రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు రోజులుగా జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వెంటనే హైదరాబాద్ రావాలని దిల్ రాజ్ కూతురుకు ఐటీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో హైదరాబాద్‌కు వచ్చిన ఆమె.. ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా జూబ్లీహిల్స్‌లోని నివాసానికి చేరుకున్నారు. హన్సితా రెడ్డిని ఐటీ అధికారులు విచారిస్తున్నారు. విచారణ ఇప్పటికే ఇంట్లో డాక్యుమెంట్లను ఐటీ స్వాధీనం చేసుకుంది. హన్సిత రెడ్డి నిర్మించిన చిత్రాలకు సంబంధించి ఆదాయ వ్యయాలపై ప్రశ్నిస్తున్నారు. ఈరోజు రాత్రి వరకు ఐటీ సోదాలు కొనసాగునున్నాయి.

కాగా.. హైదరాబాద్‌లో రెండో రోజు ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. ఎస్‌వీసీ, మైత్రి, మ్యాంగో మీడియా సంస్థల్లో తనిఖీలు జరుగుతున్నాయి. సినిమాలకు పెట్టిన బడ్జెట్‌పై అధికారులు ఆరా తీస్తున్నారు. పుష్ప-2 బడ్జెట్, వచ్చిన ఆదాయంపై అధికారులు ఆరా తీశారు. ఐటీ రిటర్న్ భారీగా ఉండడంతో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. నిన్న కూడా టాలీవుడ్‌లోని పలువురు ప్రముఖల నివాసాలపై ఐటీ అధికారులు దాడులు చేశారు. మంగళవారం నాడు తెల్లవారుజాము నుంచే ఐటీ దాడులు షురూ అయ్యాయి. మొత్తం ఎనిమిది చోట్ల దాదాపు 55 ఐటీ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేసింది. ప్రముఖ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్, దిల్ రాజు కూతురు హన్సిత రెడ్డి ఇళ్లలో సోదాలు జరిగాయి. మైత్రి మూవీ మేకర్స్ సంస్థకు సంబంధించి మైత్రి నవీన్, సీఈఓ చెర్రీ ఇళ్లు, కార్యాలయాలు, వారి భాగస్వాముల ఇళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. అలాగే దిల్ రాజు భార్య తేజస్వినిని తీసుకెళ్లి బ్యాంకు లాకర్లు తెరిపించారు. ఈరోజు మరికొన్ని డాక్యుమెంట్లను వారు పరిశీలిస్తున్నారు. అలాగే ఎస్‌వీసీ ఆఫీస్‌కు దిల్ రాజును తీసుకెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### టాలీవుడ్ లో బ్లాక్ మనీ గుట్టు అంతా బయటకు వస్తుందా ?

సాధారణంగా సినిమా రంగం అంటే బ్లాక్ మనీ ఎక్కువగా ఉంటుందని అనుకుంటారు. నగదు వ్యవహారాలు జరుగుతాయని అనుకుంటారు. అలాంటి వాటికి చోటు లేకుండా.. ఐటీ దాడులు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఎవరెవరి వద్ద ఎంతెంత లభిస్తాయన్న విషయాన్ని ఐటీ అధికారులు సోదాలు పూర్తి అయిన తర్వాత ప్రకటించే అవకాశం ఉంది. బడా నిర్మాతలపై ఐటీ దాడులు జరుగుతూండటంతో.. ఇతర నిర్మాతలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి - కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ఈ కమిటీ రాష్ట్రంలో 2023 డిసెంబర్ దాకా ఉన్న పరిస్థితులను, ఇప్పుడున్న పరిస్థితులను అంచనా వేస్తుందని కేటీఆర్ తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేసింది. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంట్, భూమి శిస్తు రద్దు, నీటి తీరువా రద్దు, మిషన్ కాకతీయతో చెరువులను బాగు చేశాం. సాగునీటి పథకాలు కాళేశ్వరం, సీతారామ, పాలమూరు ప్రాజెక్టులను నిర్మించారు కేసీఆర్. స్వయంగా రైతు ఆత్మహత్యలను నివారించే రాష్ట్రం తెలంగాణ అని పార్లమెంట్‌లో ప్రకటించే స్థాయికి చేరాం. రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపగలిగాం. భూముల ధరలు పెరగడంతో రైతుల్లో ఒక విశ్వాసం నెలకొంది అని కేటీఆర్ తెలిపారు.

### రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది..

రాహుల్ గాంధీ నాయకత్వంలో వరంగల్ డిక్లరేషన్ పేరిట ఎన్నో హామీలు ఇచ్చింది. పంటకు బోనస్, రైతు భరోసా, మద్దతు ధర, కొనుగోలు కేంద్రాలు పెంచుతామని చాలా చెప్పారు. ఇవన్నీ నమ్మిన రైతులు.. 2 లక్షల రుణమాఫీ చేస్తామంటే విశ్వసించి కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. రాజకీయాల్లో విజయాలు, అపజయాలు జరుగుతుంటాయి. ఇవన్నీ మాకు పెద్ద విషయం కాదు.. బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితినే కాదు.. భారత రైతు సమితి కూడా. మా కృషి, సంకల్పం, పోరాటం.. ఈ రాష్ట్రంలో 65 శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్న వారంతా బాగుండాలి. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదు. ఇవాళ ఎన్నికలు లేవు.. అధికారంలోకి రావడానికి రాజకీయమైన ప్రయత్నం కాదు. ఈ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన అమలు చేయకపోవడంతో, ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతో రైతులు నిరాశ, నిస్పృహతో ఉన్నారు. ఇప్పటి వరకు 400 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నరు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలు అని కేటీఆర్ తెలిపారు.

### రైతాంగానికి అండగా నిలబడే ఆలోచన మాది..

ఈ ఏడాది కాలంలో ఏం జరిగింది..? ఏం చేస్తే బాగుంటుంది..? అని నిర్మాణాత్మకంగా ఆలోచన చేస్తున్నాం. పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రైతుల పట్ల ఉండే ఆవేదన, ఆర్తి ఈ రాష్ట్ర పాలకులకు లేదు. కేసీఆర్ ఆదేశం మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేశాం. నిరంజన్ రెడ్డి నేతృత్వంలో కమిటీ రాష్ట్రమంతటా విస్తృతంగా రాబోయే నెల రోజుల పాటు పర్యటిస్తుంది. రైతు సంఘాలు, రైతులతో ఎక్కడికక్కడ కలుస్తారు. ఈ నెల 24 నుంచి ఈ కమిటీ పూర్వ ఆదిలాబాద్ జిల్లా నుంచి తన పనిని ప్రారంభిస్తుంది. వ్యవసాయదారులను కలిసి రుణమాఫీ, రైతుభరోసా ఎంత వరకు వస్తుంది. సాగునీటి, కరెంట్ పరిస్థితి, ఇతర ఇబ్బందులు ఏం ఎదుర్కొంటున్నారనే అంశాలను సేకరిస్తారు. రైతాంగంతో మాట్లాడి వారిలో భరోసాను నింపేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తాం. ఈ కమిటీ వేయాలనే దానికి కారణం ఏంటంటే.. బ్యాంకులో ఒక రైతు రుణమాఫీ కోసం ప్రయత్నం చేసి.. అక్కడే పురుగుల మందు తాగి బ్యాంకు ఆవరణలో కుప్పకూలిపోయాడు. మనసున్న వారు కదలక తప్పదు. ఒక మంచి ఆలోచనతో.. రైతాంగానికి అండగా నిలబడే ఆలోచన మాది. ఈ క్రమంలోనే రైతుల పక్షాన అధ్యయన కమిటీ వేశామని కేటీఆర్ స్పష్టం చేశారు.

### గ్రామసభల్లో ప్రజలు మర్లబడుతున్నారు

గ్రామసభల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఇవాళ ఆగ్రహంతో టెంట్లను కూలగొట్టినట్టే.. రేపు ఏదో దశలో ఈ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరిస్తారని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అధ్యయన కమిటీ చైర్మన్ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అధ్యక్షతన మంచిరేవులలోని ఆయన నివాసంలో ఈ సమావేశం జరగ్గా.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. సమావేశం ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. గ్రామసభల్లో ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద సమాధానాలు ఉన్నాయా? ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ, రైతుబంధు గురించి ప్రజలు అడుగుతున్నారు. వీటికి సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం వద్ద సత్తా లేదు. అధికారంలోకి రాగానే ప్రజా పాలన పేరిట కోటి 6 లక్షల దరఖాస్తులు తీసుకున్నారు. రేషన్ కార్డు, రైత భరోసా కోసం దరఖాస్తులు తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు ఎందుకు తీసుకుంటున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎవరి తప్పు ఇది.. ఆ దరఖాస్తులు ఎక్కడ..? ప్రభుత్వం వద్ద సమాచారం లేదు. ప్రభుత్వం పరిపాలనలో నిమగ్నం కావాలి.. ఇతర కార్యక్రమాలు బంద్ చేయాలి. ప్రజలకు మేలు చేసే విధంగా పని చేస్తే నిరసనలు తప్పుతాయి. లేదంటే నిరసనలు తప్పవు. ఇవాళ గ్రామసభల్లో ప్రజలు మర్లబడుతున్నారు.. టెంట్లు కూలగొడుతున్నారు. రేపు ఇదే తీరుగా కొనసాగితే ఏదో దశలో ప్రజలు తిరస్కరిస్తారు అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

### బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు అనుమతి

నల్లగొండలో బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు ఈ నెల 28న అనుమతి ఇచ్చింది. అయితే ఈ రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తున్నది.. నిరసన చెప్పొచ్చు అని సీఎం రేవంత్ రెడ్డి చాలా సార్లు చెప్పారు. మా చిన్న ధర్నాకే ఆగమాగం అయిపోయి.. చివరికి అనుమతి నిరాకరించారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా రాజ్‌భవన్ ముందు ధర్నా చేయొచ్చుట. వందలాది వాహనాలు తిరిగే బిజీ రోడ్డు రాజ్‌భవన్ రోడ్డు.. అక్కడ సీఎం, మంత్రులు ధర్నా చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది కాదంట. కానీ మేం నల్లగొండ క్లాక్ టవర్ వద్ద ధర్నా చేస్తే.. ట్రాఫిక్ స్తంభించిపోతుందట. అది అంతర్జాతీయ రహదారి అయినట్టు రాష్ట్రాల మధ్య రాకపోకలు దెబ్బతినే విధంగా ఉందని రిపోర్టు ఇచ్చి నిరాకరించారు. చివరకు హైకోర్టు న్యాయం చేసింది. రైతు మహాధర్నాకు అనుమతి ఇచ్చినందుకు హైకోర్టుకు ధన్యవాదాలు. కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుని రైతుల ఆవేదన, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కేటీఆర్ తెలిపారు.

### 6 లక్షల 47 వేల పైచిలుకు రేషన్ కార్డులు ఇచ్చాం

ఒక అబద్దాన్ని నిజం చేయడానికి వందసార్లు చెప్తే నిజం అవుతుందనే అపోహలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. మేం మీలాగా రేషన్ కార్డు ఇచ్చేందుకు హడావుడి చేయలేదు. పబ్లిషిటి చేయాలనే పిచ్చి కాంగ్రెసోళ్లకు ఉంది. మా ప్రభుత్వ హయాంలో 6 లక్షల 47 వేల పైచిలుకు రేషన్ కార్డులు ఇచ్చాం. ఏనాడూ కూడా పబ్లిషిటి చేయలేదు. మీ సేవ ద్వారా లబ్దిదారులు దరఖాస్తు చేసుకుంటే ఇచ్చాం. కానీ మేం అసలు రేషన్ కార్డులు ఇవ్వనట్టు కాంగ్రెస్ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

### వాళ్ల ప్రయారిటీ ఫార్ములా కేసు.. మా ప్రయారిటీ ఫార్మర్..

ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలు పడకేశాయని దేశమంతా అంటోంది. క్రైమ్ రేట్ పెరిగింది. హోం మంత్రి లేరు. సీఎం కేవలం ప్రతిపక్షాల మీద కేసులు పెడుతున్నారు. వాళ్ల ప్రయారిటీ ఫార్ములా కేసు.. మా ప్రయారిటీ ఫార్మర్. ఎవరేం అనుకున్నా.. మేం రైతుల పక్షాన పోరాటం చేస్తాం. రైతుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ప్రయత్నిస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు.

# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఈటెల ఫిక్స్..?

మొదటి పేజీ తరువాయి

వాస్తవానికి, రాష్ట్రంలో బీసీలలోనే కాకుండా జనాభాపరంగా అత్యధిక సంఖ్యాకులున్న ముదిరాజ్ కులానికి చెందిన ఈటల రాజేందర్‌కు రెడ్డి సామాజిక వర్గంతో కూడా సంబంధాలున్నాయి. ఈటెల సతీమణి రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే. బీసీ కార్డు ఓ వైపు.. రాజకీయంగా బలమైన రెడ్డి సామాజికవర్గం మరోవైపు .. ఈటెలకు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడం వల్ల రెండు బలాలు కలిసి వస్తాయని బీజేపీ భావిస్తోందంట. బీఆరెస్‌తో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు, బండి, ఈటెల మధ్య విభేదాలు పార్టీలో అయోమయ వాతావరణం కారణంగా శాసన సభ ఎన్నికల్లో బీజేపీకి గట్టి దెబ్బ పడింది. ఎంపీ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ.. బండి సంజయ్‌కు కేంద్ర మంత్రి పదవి ఇవ్వడంతో ఈటెలకు లైన్ క్లియర్ అయ్యిందంటున్నారు.

వాస్తవానికి ప్రస్తుతం అధ్యక్ష పదవి రేసులో ఈటెలతో పాటు ఎంపీలు ధర్మపురి అరవింద్, రఘునందన్, మరో నేత రామచంద్రరావు వంటి వారు పోటీ పడుతున్నారు. వారితో పోలిస్తే నాన్ కాంట్రవర్షియల్ నేతగా, రాష్ట్ర వ్యాప్తంగా పరిచయాలు ఉన్న ఈటెల రాజేందరే బెటర్ అన్న ఆలోచనలో అధిష్టానం ఉందంట. రాజా సింగ్ పేరు కూడా వినిపిస్తున్నా.. సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యంతో పాటు వ్యక్తిగతంగా చూసుకున్నా ఈటల రాజేందర్ వైపే ఢిల్లీ పెద్దలు మొగ్గు చూపుతున్నారంట. 2021లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈటలపై కత్తి కట్టి అవమానకరమైన పరిస్థితుల్లో పార్టీ నుంచి బయటకు వెళ్లేలా చేశారు. అప్పుడున్న పరిస్థితుల్లో ఈటల కేంద్రంలో బలంగా ఉన్న బీజేపీ వైపు మొగ్గు చూపాల్సి వచ్చింది ఈటల.

తెలంగాణ ఉద్యమకారుడిగా , రాడికల్ భావజాలంతో రాజకీయాల్లో ఎదిగిన ఈటెల మాస్ లీడర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నమ్మిన బంటుగా ఉంటూ హుజురాబాద్ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పదిలం చేసుకున్నారు. వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వచ్చారు. కేసీఆర్‌ను ఎదిరించి బీజేపీ అభ్యర్థిగా బైపోల్స్‌లో కూడా విజయం సాధించి సంచలనం సృష్టించారు. ఆ తరువాత కేసీఆర్ మీద పోటీ చేసే క్రమంలో రెండు పడవల మీద కాళ్లు పెట్టడం, అనూహ్యంగా రెండు చోట్ల ఓడిపోవడం వెంట వెంటనే జరిగిపోయింది.

తర్వాత మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచి బీజేపీ జెండా ఎగురవేశారు. ఈటెలకు బీజేపీ రాష్ట్ర బాధ్యతలు ఇస్తే ఉద్యమ సంబంధాలు, సామాజిక బలం తోడై పార్టీ మరింత బలోపేత అవుతుందని అధిష్టానం భవిస్తోందంట. ఈటెలకు పగ్గాలు అప్పగించి రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను కోలుకోకుండా చేయాలని స్కెచ్ గీస్తున్నారంట. బీఆరెస్ నేతలతో సత్సంబంధాలున్న ఈటెల వారిని బీజేపీలోకి లాగుతారనే అంచనాలు వేసుకుంటున్నారంట.

దాంతో ప్రధాన ప్రతిపక్షంగా బీజేపీ ఎదగవచ్చని లెక్కలు వేసుకుంటున్నారంట. ప్రధాన ప్రతిపక్షంగా బీఆరెస్ కనుమరుగైతే రాష్ట్రంలో బీజేపీనే ప్రత్యామ్నాయంగా మారుతుంది. ఆ అంచనాలతోనే మాస్ ఇమేజ్ పుష్కలంగా ఉన్న ఈటెలకు పగ్గాలు అప్పజెప్పాలని ఢిల్లీ పెద్దలు ఫిక్స్ అయ్యారంట. వచ్చే వారంలోగా సంస్థాగత ఎన్నికలన్నీ పూర్తవుతున్న తరుణంలో వచ్చే వారంలో ఈటెలను అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నిజామాబాద్ ఎంపీ అరవింద్ కూడా అధిష్టానం దృష్టిలో ఉన్నప్పటికీ ఆయన ఆవేశం మైనస్ పాయింట్ అయిందంటున్నారు. రాజాసింగ్‌కు విస్తృతమైన ప్రజాసబంధాలు లేవు. ఆయన ఇమేజ్ సొంత సెగ్మెంట్ అయిన గోషామహల్‌కే పరిమితం. రామచంద్రరావు వంటి లీడర్లు ప్రజల్ని ప్రభావితం చేయగలిగే లీడర్లు కాదని అధిష్టానం అభిప్రాయపడుతుందంట. కానీ ఈటలకు అలా కాదు. రాష్ట వ్యాప్తంగా ప్రభావం చూపించగలరు అందుకే ఆయనే బెస్ట్ ఆప్షన్ అని బీజేపీ పెద్దలు ఫిక్స్ అయ్యారంట. ఇంత కాలం అధ్య పదవికి సంబంధించి పార్టీలో పాత, కొత్త నేతల పంచాయతీ నడిచింది. అయితే అధ్యక్షుడు కావడానికి ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ అవసరం లేదంటూ ఇటీవల కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైకమాండ్ నుంచి సంకేతాలు ఉండబట్టే ఆయన అలా మాట్లాడారని, ఈటలే ప్రెసిడెంట్ అనడానికి అవే సంకేతాలని అంటున్నారు.

# హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ కొత్త టెక్ సెంటర్

మొదటి పేజీ తరువాయి

హెచ్ సీఎల్ కొత్త సెంటం లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, అత్యాధునిక క్లౌడ్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లను అందిస్తుంది.

### 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో

3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైటెక్ సిటీలోహెచ్?సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ అందుకుంది. దీంతో దాదాపు 5,000 మంది ఐటీ రంగానికి చెందిన వారికి ఉద్యోగాలు లభిస్తాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు, ఐటీలో ప్రతిభా వంతులైన నిపుణులతో ఇప్పటికే హెచ్?సీఎల్ గ్లోబల్ నెట్? వర్క్? సెంటర్? గా హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని హెచ్?సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హెచ్?సీఎల్ సేవల విస్తరణను సీఎం రేవంత్? రెడ్డి స్వాగతించారు. ప్రపంచంలో ఐటీ హబ్ గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుందని పేర్కొన్నారు. వచ్చే నెలలో కొత్త సెంటర్‌ను ప్రారంభించాలని హెచ్‌సీఎల్ ప్రతినిధులను తెలంగాణకు ఆహ్వానించారు.

స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు హైదరాబాద్‌లోని టెక్నాలజీ, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ మంత్రి శ్రీధర్? బాబు అన్నారు. ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలని హెచ్?సీఎల్ టెక్ ప్రతినిధులను కోరారు. ప్రభుత్వం తరపున తగిన సహకారం అందిస్తామని చెప్పారు.

2007 నుంచే హెచ్‌సీఎల్ హైదరాబాద్ నుంచి ప్రపంచ వ్యాప్తంగా తమ క్లయింట్లకు సేవలను అందిస్తోంది. కొత్త కేంద్రంతో హైదరాబాద్ లో హెచ్?సీఎల్ మొత్తం అయిదు సెంటర్లను విస్తరించనుంది.




### గాంధీభవన్ లో కొట్టుకున్న యూత్ కాంగ్రెస్ నేతలు

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో రెండు పక్షాలు తీవ్ర ఆగ్రహానికి గురికావడంతో వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. రెండు వర్గాలు చీలిన నేతలు బాహాబాహీకి దిగారు. ఇతర పార్టీల నుంచి ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి వచ్చి యూత్ కాంగ్రెస్‌లో చేరిన వారికి పదవులు ఇవ్వడంతో పార్టీలో చాలా కాలంగా పనిచేస్తున్న నాయకులకు మింగుడుపడలేదు. దీంతో కొత్తగూడెం యువజన కాంగ్రెస్ నేతలకు చిర్రెత్తుకొచ్చింది. తమకు దక్కాల్సిన పదవులను నిన్నకాక మొన్న పార్టీలో చేరినవారికి ఇస్తారా అంటూ పార్టీ పెద్దలను నిలదీశారు. అయినా వివాదం సద్దుమణగకపోవడంతో బుధవారం గాంధీభవన్‌లో ఇరువర్గాలు సమావేశమై పెద్దలతో చర్చించాలని నిర్ణయించారు. అనుకున్న ప్రకారం బుధవారం గాంధీభవన్‌లో సమావేశమయ్యారు.

ఈ క్రమంలోనే రెండు వర్గాల మధ్య మాటామాటా పెరిగింది. ఒకరికి వ్యతిరేకంగా మరొకరు నినాదాలు చేసుకున్నారు. ఇరు పక్షాల యూత్ కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యారు. ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. దీంతో గాంధీభవన్‌లో హైటెన్షన్ నెలకొంది. కాగా గాంధీభవన్‌లో గొడవ గురించి తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవలసిన నేతలు తరుచూ వివాదాల సృష్టించడాన్ని సీనియర్ నేతలు తప్పుపట్టారు. ఇటీవల బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు దాడి చేసిన ఘటన పై కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మా జోలికి వస్తే కబడ్దార్

**మొదటి పేజీ తరువాయి**

రౌడీ మూకలతో దాడులు చేసే సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదన్నారు. "కాంగ్రెస్ పార్టీ నాయకుల్లారా మా జోలికి వస్తే ఖబడ్దార్" అంటూ హెచ్చరించారు. అప్లికేషను ఇవ్వగానే అన్ని ఇస్తాం అన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ సభలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి నీళ్లు విడుదల చేయకుండా రైతుల పంటలను ఎండ బెడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని విమర్శించారు. నల్లగొండ మేధావుల్లారా కృష్ణ జలాలతో అన్యాయం జరుగుతుందని..ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ , బీజేపీ పార్టీలు ఒక్కటే అని ఎమ్మెల్సీ వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణలో అతిపెద్ద పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట అని కవిత అన్నారు. కేసీఆర్ రూ.1200 కోట్లను పెట్టి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా యాదాద్రి అభివృద్ధి జరగాలన్నారు. లక్ష్మీనరసింహ స్వామి పుష్కరిణిని విరజానది పుష్కరిణిగా భావిస్తారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ గిరి ప్రదక్షిణలో పాల్గొనాలని కోరారు. మెట్ల ద్వారా స్వామివారి దర్శనం చేసుకుంటే గిరి ప్రదక్షిణం పూర్తవుతుందని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సంవత్సర కాలంలో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. ప్రజలకు సేవ చేయడానికి లక్ష్మీనరసింహస్వామి వారి దీవెనలు ఇవ్వాలని కోరుకున్నట్లు ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

# దమ్మంటే రేవంత్ రెడ్డి

## గ్రామ సభలకు రావాలి - హరీశ్ రావు



అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పాలనలో కూడా అదే పరంపర కొనసాగిస్తున్నదని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సిద్ధిపేట పట్టణంలోని 15 వార్డ్ గాడి చెర్లపల్లిలో నిర్వహించిన ప్రజా పాలన వార్డు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..దరఖాస్తుల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. ఏడాది కిందట దరఖాస్తు ఇస్తే ఇప్పటికీ దిక్కు లేదు, మళ్లీ ఎన్నిసార్లు దరఖాస్తులు ఇవ్వాలని మండిపడ్డారు. అప్పుడు అందరికి పరమాన్నం పెడుతామని ఇప్పుడు అందరికి పంగాణామాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు.

రుణమాఫీ అయింది అని రేవంత్ రెడ్డి హైదారాబాద్‌లో చెప్తున్నాడు. దమ్మంటే ఇక్కడికి రా చూపెడతా అని సవాల్ విసిరారు. వడ్డీతో సహా రెండు లక్షల రుణమాఫీ చేస్తానని ఇప్పుడు మిత్తీ కట్టించుకున్ని పాక్షిక రుణమాఫీ చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి మాటలు నమ్మి ఎంతోమంది రైతులు ఆగమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలు, రుణమాఫీ సగం కూడా చేయలేదన్నారు. దమ్మంటే రేవంత్ రెడ్డి గ్రామ సభలకు రావాలి. నేను కూడా వస్తాను. పోలీసులను పెట్టి నిర్బంధాల మధ్య గ్రామ సభలు నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రజల ఉసురు పోసుకుంటున్నారు..

రేవంత్ రెడ్డి డమ్మీ చెక్ ఇచ్చావా? రెండు నెలలు అయినా రేవంత్ రెడ్డి ఇచ్చిన చెక్ పాస్ కాలేదన్నారు. ఈ ప్రభుత్వానికి మోసాలు తప్పా నీతి నిజాయితీ లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పిట్టల్లా రాలిపోతున్నారు. వానాకాలం రైతు బంధు ఎప్పుడు వేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం 15వేల రైతుబంధు ఇవ్వాలన్నారు. కరోనా సమయంలో కూడా కేసీఆర్ రైతబంధు ఆపలేదని గుర్తు చేశారు. వెంటనే రైతులకు వానాకాలం, యాసంగి రైతుబంధు విడుదల చేయాలన్నారు. దరఖాస్తుల పేరుతో ప్రజల ఉసురు పోసుకుంటున్నారు, వెంటనే అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఒక్క హామీ నెరవేర్చలేదు..

రేవంత్ రెడ్డి పేదల ఇండ్లు కూల్చడం తప్పా ఒక్క ఇల్లు కూడా కట్టలేదన్నారు. వ్యవసాయ కూలీల అందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలన్నారు. గ్రామ సభల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఏడాదిలోనే ఎంతో వ్యతిరేకత మూటగట్టుకున్నారు. జార?ండ్ సీఎం హేమంత్ సోరేన్ ఇచ్చిన మాట ప్రకారం హామీ నెరవేరుస్తున్నాడు. ఆంధ్రాలో గెల్వగానే పెంచుతా అన్న పెన్షన్‌ను చంద్రబాబు పెంచి ఇచ్చాడు. రేవంత్ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు.

# ఏకలవ్య మోడల్ స్కూల్లో ప్రవేశాలు..



భద్రాద్రి కొత్తగూడెం : ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రామవరం ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రసంజిత్ గోషాల్ తెలిపారు. గిరిజనులైన విద్యార్థిని,విద్యార్థులు, తల్లిదండ్రులు లేని, విద్యార్థులు, దివ్యాంగులైన విద్యార్థులు, 5వ తరగతి చదివి మార్చి 2025 నాటికి పది నుంచి 13 ఏళ్ల లోపు వయసు వారై ఉండి ఉండాలి. ఆన్లైన్లో, దరఖాస్తు చేసుకొనుటకు ఆఖరి తేదీ ఫిబ్రవరి 16, పరీక్ష రుసుము 100 రూపాయలు ఉంటుందని, ప్రవేశ పరీక్ష మార్చి 16వ తేదీన జరగనుందని, ఆరవ తరగతిలో ఖాళీలు 30 బాలికలకు 30 బాలురకు ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపల్ ప్రసంజిత్ గోషాల్ తెలియజేసారు.

# హైడ్రా కూల్చివేతలకు దానం అడ్డు..

## రేవంత్ రెడ్డితోనే తేల్చుకుంటా



బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్ హైడ్రాపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. చింతల్ బస్తీలో షాదన్ కాలేజీ ఎదురుగా ఉన్న ఆక్రమణలను హైడ్రా అధికారులు బుధవారం కూల్చివేశారు. కూల్చివేతలను అడ్డుకున్న దానం నాగేందర్ అధికారులపై మండిపడ్డారు. తన అనుమతి లేకుండా ఎలా కూల్చివేస్తారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడినుంచో బ్రతకడానికి వచ్చినోళ్లపైపై దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. దావోస్ నుంచి సీఎం వచ్చే వరకు కూల్చివేతలు ఆపాలని డిమాండ్ చేశారు. కూల్చివేతలు ఆపకుంటే ఆందోళన చేస్తానని హెచ్చరించారు.

హైడ్రా కూల్చివేతల విషయంలో దానం నాగేందర్ మొదటి నుంచి వ్యతిరేకంగా ఉన్నారు. జూబ్లిహిల్స్ లో ఓ పార్కు ఆక్రమణను తొలగించినప్పుడు ధర్నా చేశారు. అయితే ఆ తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలపై బహిరంగ విమర్శలు వద్దని ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని ఆయనకు కాంగ్రెస్ అగ్రనేతలు స్పష్టం చేశారు. అయితే కొంత కాలం సైలెంట్ గా ఉన్న ఆయన ఇప్పుడు మరోసారి హైడ్రాపై విరుచుకుపడుతున్నారు. తన నియోజకవర్గంలో అసలు హైడ్రా అడుగు పెట్టాల్సిన అవసరం లేదని అంటున్నారు. ఇప్పుడు నేరుగా అధికారుల్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై గతంలో చాలా సార్లు సీరియస్ విమర్శలు చేశారు.

బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన సికింద్రాబాద్ నుంచి లోక్ సభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత నుంచి ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. హైడ్రా కారణంగా ప్రజలకు నష్టం జరుగుతోందని గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని దానం యూట్యూబ్ చానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలోల చెబుతున్నారు. ఓటు బ్యాంకు అయిన ప్రజలను కాపాడుకోవాలని ..హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదని ఆయనంటున్నారు. మన మీద నమ్మకం లేదని, ఇప్పుడైనా దానిని పెంచుకునే ప్రయత్నం చేయాలని కూడా ముఖ్యమంత్రి రేవంత్ కు సలహా ఇవ్వడం సంచలనంగా మారింది. అదే సమయంలో ఆయన కొంత మంది అధికారుల తీరుపై మండిపడుతున్నారు. తాను కాంగ్రెస్ లో చేరినా తన మాట వినడం లేదని.. కేసులు పెడతానంటూ బెదిరించడం వల్ల ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి చెడ్డపేరు వస్తుందని అంటున్నారు. అదే సమయంలో 'ఫార్ములా ఈ' కార్ రేసులో కేటీఆర్ కు మద్దతుగా మాట్లాడారు. ఫార్ములా ఈ కార్ రేసుతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని చెబుతున్నారు ఈ విషయంలో ఎలాంటి అనుమానం లేదని, ఈ రేసుతో ప్రపంచం దృష్టిని ఆకర్షించగలిగామని పేర్కొన్నారు.ఇప్పుడు నేరుగా హైడ్రాపై విరుచుకుపడ్డారు. దానం తీరు కాస్త తేడాగా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా గుసగుసలాడుకుంటున్నారు.

# కొత్త రేషన్ కార్డులతో 40 లక్షల మందికి లబ్ధి..

## మంత్రి ఉత్తమ్



ప్రస్తుతం తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఇప్పటికే అప్లై చేసుకున్న వారికి సంబంధించి రేషన్ కార్డు అర్హత కలిగిన వారి జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే దరఖాస్తు చేసుకున్న జాబితాలో పేరు లేని వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే గ్రామ సభలు నిర్వహిస్తున్న ప్రభుత్వం.. రేషన్ కార్డు జాబితాలో పేరు లేని వారు ఈ గ్రామసభల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, ప్రభుత్వం సూచిస్తోంది. దీంతో గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. అయితే రేషన్ కార్డుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామ సభల్లో తీవ్ర గందరగోళం, ఆందోళనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు.

గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. 10 ఏళ్ల పాటు రేషన్ కార్డుల జారీపై దృష్టి పెట్టలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో 40 లక్షల మందికి లబ్ధి చేకూర్చేలా కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తోందని చెప్పారు. కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్, మానకొండూరులో నిర్వహించిన గ్రామసభలకు హాజరైన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ దుకాణాల్లో ఇక నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని తేల్చి చెప్పారు. అయితే రేషన్ కార్డు రాని వారు అధైర్యపడొద్దని.. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు రాలేదని ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలందరికీ రేషన్ కార్డులు ఇస్తామని.. ప్రతిపక్షాలు ఆరోపణలను ఎవరూ పట్టించుకోవద్దని చెప్పారు.

ప్రజాపాలన సందర్భంగా వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈనెల 21వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన గ్రామసభలు.. ఈనెల 24వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అయితే ఇప్పటికే రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా.. అందులో పేరు లేకపోతే ఈ గ్రామ సభల్లో మళ్లీ అప్లై చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో.. ప్రజలు భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు.

# సింగర్ మధుప్రియను అరెస్ట్ చేయండి..



## బీజేపీ నాయకుల డిమాండ్

హైదరాబాద్: ఫోక్ సింగర్ మధు ప్రియ వివాదంలో చిక్కుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో ఆమె సాంగ్ షూటింగ్ చేయడం వివాదస్పదమైంది. కాళేశ్వరం గర్భగుడిలో మధుప్రియ సాంగ్ షూట్ చేయడంపై బీజేపీ శ్రేణులు భగ్గుమన్నారు. ఈ మేరకు 2025, జనవరి 22న శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. భక్తులు మనోభావాలు దెబ్బతీస్తూ గర్భగుడిలో సాంగ్ షూటింగ్ చేసిన మధుప్రియపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాళేశ్వరాలయ ఈవోను సస్పెండ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాగా, భూపాలపల్లి జిల్లాలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 20న సినీ గాయని మధుప్రియ ఆలయాధికారుల అనుమతి లేకుండా గర్భగుడిలో ప్రైవేటు ఆల్బమ్ సాంగ్ షూటింగ్ చేశారు. గర్భగుడిలో ప్రైవేట్ సాంగ్ షూటింగ్ చేయడంపై సింగర్ మధు ప్రియపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. గర్భగుడిలోకి సెల్ ఫోన్, కెమెరాలు తీసుకుపోవడంపై నిషేదం ఉన్నప్పటికీ సాంగ్ షూటింగ్ చేయడంపై భక్తులు, హిందూ సంఘాలు, బీజేపీ నేతలు మండిపడుతున్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసిన సింగర్ మధు ప్రియపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఆలయంలో ప్రైవేట్ సాంగ్ షూటింగ్?కు అనుమతి ఇచ్చిన ఆలయాధికారులపైన యాక్షన్ తీసుకోవాలని కోరారు. కాగా, వెంకటేష్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీలోని గోదారి గట్టుపైన రామచిలకవే సాంగ్ మధుప్రియ పాడిన విషయం తెలిసిందే. ప్రముఖ సింగర్ రమణ గోగుల, మధు ప్రియ కలిసి పాడిన ఈ పాట సూపర్ హిట్ అయ్యింది.

# భార్యను ముక్కలుగా నరికి కుక్కర్‌లో ఉడకపెట్టిన భర్త

## సినిమాను మించిన స్క్రీన్ ప్లే





హైదరాబాద్ పరిధిలోని మీర్‌పేట్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త.. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా కోసి కుక్కర్‌లో ఉడకపెట్టాడు. చివరగా ఆ మాంసం ముద్దలను ఎండబెట్టి.. పొడిగా మర్చి నగర శివారులోని జిల్లెలగూడ చెరువులో పడేశాడు. వింటేనే ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ప్రకాశం జిల్లా, జేపీ చెరువుకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి గురుమూర్తి ప్రస్తుతం డీఆర్డీవో లో ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈయన భార్య వెంకట మాధవి(35), ఇద్దరు పిల్లలతో కలిసి జిల్లెలగూడ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీలో నివాసముంటున్నాడు. భార్యపై అనుమానం పెంచుకున్న గురుమూర్తి ఆమెను హంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే సంక్రాంతి పండగ రావడంతో.. పిల్లలను ఊరికి పంపించి పక్కా ప్లాన్ ప్రకారం భార్యను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా కోసి శరీర భాగాలన్నింటిని నాలుగైదు దఫాలుగా కుక్కర్‌లో ఉడకపెట్టాడు. అంతటిలో ఆగకుండా ఆ మానవ మాంసాన్ని.. ఇంట్లోనే ఎండబెట్టి పొడిగా మార్చాడు. చివరగా ఆ పొడిని తీసుకుపోయి నగర శివారులోని జిల్లెలగూడ చెరువులో పడేశాడు.

వెంకట మాధవి నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ లేకపోవడంతో.. అనుమానమొచ్చిన తల్లిదండ్రులు ఈనెల 13న కుమార్తె కనిపించడం లేదని మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో గురుమూర్తి వారి వెంటే ఉన్నారు. తనకు ఏం తెలియదు అన్నట్టుగా అత్తమామలతో కలిసి మీర్‌పేట్ పీఎస్‌కు వచ్చాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు స్థానికులను విచారించగా.. భార్యాభర్తల మధ్య పదే పదే గొడవలు జరుగుతున్న విషయం బయటకు వచ్చింది. అనుమానంతో పోలీసులు గురుమూర్తిని అదుపులోకి విచారించగా.. చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు.

ఇక్కడ మరో విషయం ఏమిటంటే.. భార్యను చంపడానికి ముందు గురుమూర్తి ట్రయల్ కోసం ఒక కుక్కను చంపి ముక్కలుగా నరికిన ఉడకబెట్టడాని తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసులు వెంకట మాధవి శరీర పొడిని సేకరించే పనిలో పడ్డారు. పొడి చెరువు నీటిలో కలిసిపోయి ఉంటుంది కనుక సేకరించడం కాస్త కష్టమే.

# బిల్ గేట్స్‌తో చంద్రబాబు భేటీ..



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన కొనసాగుతోంది. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు చంద్రబాబు నాయుడు స్విట్జర్లాండ్ వెళ్లిన సంగతి తెలిసిందే. చంద్రబాబుతో పాటుగా మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, ఇతర ఉన్నతాధికారులు దావోస్ వెళ్లారు. దావోస్ పర్యటనలో భాగంగా పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో భేటీ అవుతూ.. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరిస్తున్నారు. పెట్టుబడులు పెట్టి, పరిశ్రమలు స్థాపించే వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే రాయితీలను, ప్రోత్సాహకాలను వారికి వివరిస్తున్నారు. ఆ రకంగా పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పర్యటన కొనసాగుతోంది

ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్ ఫౌండర్, మాజీ సీఈవో బిల్‌గేట్స్‌తో సీఎం నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. దావోస్‌లో బిల్‌గేట్స్‌తో చంద్రబాబు, నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరించిన సీఎం.. ఇందుకోసం సహాయ, సహకారాలు అందించాలని బిల్ గేట్స్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్న వరల్డ్ క్లాస్ ఏఐ యూనివర్సిటీ గురించి చంద్రబాబు బిల్ గేట్స్‌కు వివరించారు. ఈ ఏఐ యూనివర్సిటీ సలహామండలిలో భాగస్వాములు కావాలని గేట్స్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో గేట్స్ ఫౌండేషన్ కార్యకలాపాలు నిర్వహించాలని చంద్రబాబు కోరారు. బిల్ గేట్స్‌తో భేటీ సందర్భంగా ఆరోగ్యం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇన్నోవేషన్ విషయాల్లో సహకారంపై చర్చించినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

మరోవైపు బిల్ గేట్స్‌తో భేటీ అయిన విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. 1995లో ఐటీ కోసం బిల్ గేట్స్‌ను కలిసిన విషయాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు.. మళ్లీ ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం 2025లో బిల్ గేట్స్‌ను కలిసినట్లు ట్వీట్ చేశారు. చాలా ఏళ్ల తర్వాత బిల్ గేట్స్‌ను కలవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మరోవైపు రాబోయే రోజులన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ టెక్ టెక్నాలజీలదేనని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీలో ఏఐ రంగాన్ని ప్రోత్సహించాలని చంద్రబాబు ప్రణాళికలు రచిస్తున్నారు. అందులో భాగంగానే అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనాన్ని కూడా నిర్మించనున్నారు. డీప్ టెక్నాలజీ ఐకానిక్ బిల్డింగ్ కోసం ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఇప్పటికే ఆదేశించారు.

# మహాకుంభమేళా వెళ్లే వారి కోసం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ..

## 7 రోజుల టూర్.. పూర్తి వివరాలివే!




ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనం ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా మొదలైపోయింది. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహాకుంభమేళా జనవరి 13న మొదలైంది. ఫిబ్రవరి 26తో ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా ముగియనుంది. మహాకుంభమేళాలో పాల్గొనేందుకు, పుణ్యస్నానాలు ఆచరించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల మంది తరలివెళ్తున్నారు. అలాగే ఇతర దేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లేవారికి ఏపీఎస్ఆర్టీసీ సూపర్ న్యూస్ చెప్పింది. మహాకుంభమేళాకు వెళ్లే వారి కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది.

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఏపీఎస్ఆర్టీసీ డిపో అధికారులు మహాకుంభమేళాకు వెళ్లే వారి కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని కొవ్వూరు డిపో అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. కొవ్వూరు డిపో నుంచి బయల్దేరనున్న బస్సు.. వివిధ పుణ్యక్షేత్రాల మీదుగా ప్రయాగ్‌రాజ్ చేరుకుంటుంది. ఆ తర్వాత తిరిగి కొవ్వూరు వస్తుందని.. మొత్తం ఏడు రోజుల పాటు యాత్ర జరుగుతుందని అధికారులు చెప్పారు.

ఫిబ్రవరి ఒకటో తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కొవ్వూరు డిపో నుంచి బస్సు బయల్దేరుతుందని డిపో అధికారులు తెలిపారు. భువనేశ్వర్, పూరి, కోణార్క్, ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు చేరుకుంటుంది. ఆ తర్వాత వారణాసి, గయ, బుద్ధ గయ, అరసవల్లి, శ్రీకూర్మం మీదుగా కొవ్వూరు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. మొత్తం 7 రోజుల పాటు ఈ యాత్ర జరుగుతుందని వివరించారు.

ప్యాకేజీలో భాగంగా ప్రయాగ్‌రాజ్, కాశీలలో ఒక రోజు బస ఉంటుందని.. అలాగే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రిపూట అల్పాహారం అందిస్తామని తెలిపారు. యాత్ర సమయంలో ప్రయాణికులకు అనుకూలంగా ఉండేదుకు యాప్ కూడా రూపొందించారు. ఈ యాప్ సాయంతో ప్రయాణికులు ఎక్కడ ఉన్నా కూడా బస్సు వద్దకు చేరుకోవచ్చు. ఈ ప్యాకేజీలో భాగంగా ఒక్కరికి రూ.10 వేలు చొప్పున టికెట్ రేటు నిర్ణయించారు. ఇక ప్రయాణికుల కోసం సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సును ఏర్పాటుచేశారు. ఆసక్తి ఉన్న వారు తమను సంప్రందించి పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి..

## అధికారులకు నంద్యాల కలెక్టర్ ఆదేశం



శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి చిన్న ఇబ్బందులు కూడా తలెత్తకుండా శ్రీస్వామి అమ్మవార్లను సంతృప్తికరంగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం దేవస్థాన అన్న ప్రసాద వితరణ భవన ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నిర్వహణపై జిల్లాధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, శ్రీశైలం సబ్ డిఎఫ్ఓ మహమ్మద్ అన్వర్ అలీ, సబ్‌కలెక్టర్ సాధిక్ త్రివినాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 19 నుండి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో దేవస్థానం సిబ్బంది, పోలీస్, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేందుకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని సూచించారు. శాఖల వారిగా సమీక్షిస్తూ, అవసరమైన ప్రతిపాదనలను సమర్పిస్తే దేవస్థానం కార్యనిర్వహణాధికారిని సమన్వయం చేసి సంబంధిత ఏర్పాట్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

### భక్తులు పాదయాత్రగా వచ్చే మార్గాల్లో మెడికల్ క్యాంపులు

భక్తులకు చేసే ఏర్పాట్లపై 200 శాతం పకడ్బంది ప్రణాళికలు రూపొందిస్తే 100 శాతం అమలులోకి వస్తాయన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, త్రాగునీరు, టాయిలెట్స్, పార్కింగ్, రవాణా, భక్తులకు శీఘ్రదర్శనం తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా వెంటనే స్పందించి ఏర్పాట్లలో నిమగ్నం కావాలన్నారు. లక్షల మంది పాదయాత్ర భక్తులు వచ్చే మార్గాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని మెడికల్ అధికారులను ఆదేశించారు. భీముని కొలను, కైలాసద్వారం ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే బాధితులకు స్ట్రేచర్లు, అంబులెన్సులను కూడా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ డిఎంహెచ్ఓను ఆదేశించారు.

### ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్ట ప్రణాళిక

క్యూలైన్లలో స్వామిఅమ్మవార్ల దర్శనార్థమై వేచివుండే భక్తులు ఇబ్బందులు పడకుండా త్రాగునీరు, పాలు, అల్పాహారం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారిని సూచించారు. తెలంగాణ, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 800 బస్సులు వచ్చే అవకాశం ఉందని ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్ట ప్రణాళికలతో పార్కింగ్ చేసుకుని తిరిగి వెళ్ళేందుకు సూచిక బోర్డులతో పాటు తగు సూచనలను జారీ చేయాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా సమాచారం నిమిత్తం హెల్ప్ డెస్క్, కంట్రోల్ రూమును ఏర్పాటు చేసి తగు సమాచారాన్ని భక్తులకు తెలపాలన్నారు.

### చెక్‌పోస్టుల వద్ద రుసుం తీసుకోవద్దు..

అటవీశాఖ పరిధిలో ఉన్న చెక్‌పోస్టులలో ఫిబ్రవరి 19 నుండి మార్చి 1వ తేదీ వరకు ఎలాంటి రుసుం తీసుకోకుండా వాహనాలను అనుమతించాలని ఫారెస్ట్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు అమలు చేయడంతో పాటు అవసరమైన జనరేటర్లను సమకూర్చాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని శాఖల సమన్వయముతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. గతంలో జరిగిన చిన్న చిన్న లోటుపాట్లు వుంటే సరిచేసుకోవాలని సూచించారు. ఫారెస్ట్, పోలీసు అధికారులు సహకరించి సాక్షి గణపతి సమీపంలో ట్రాఫిక్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాలలో అన్ని శాఖలు బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని అధికారులను సూచించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు శ్రీశైలంలో భక్తులకు చేస్తున్న ఏర్పాట్లపై పిపిటి ద్వారా వివరించారు.

అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ.. క్యూ లైన్లలో భక్తులు ఇబ్బంది పడకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. దాదాపు 3 వేల పోలీసు సిబ్బందితో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు

# తిరుపతి తొక్కిసలాట ఘటనపై హైకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ



అమరావతి : తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఏపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ విచారణకు హైకోర్టు రిటైర్ట్ జడ్జి జస్టిస్ సత్యనారాయణ మూర్తిని నియమించింది. విచారణ జరిపి 6 నెలల్లో నివేదిక ఇవ్వాలని కోరింది.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా టీటీడీ వైకుంఠ ద్వార దర్శనాలకు తిరుపతిలో టోకెన్ల కేంద్రాలను నెలకొల్పింది. అయితే ఈనెల 8వ తేదీన పద్మావతి పార్కులో నెలకొల్పిన టోకెన్ల వద్ద జరిగిన తొక్కిసలాటలో 6 గురు చనిపోగా 50 మంది వరకు భక్తులు గాయపడ్డారు. టీటీడీచరిత్రలో ఎన్నడూ జరుగని విధంగా తొక్కిసలాట జరగడం, ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో టీటీడీ, కూటమి ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి

స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెంటనే ఆసుపత్రిలో చికిత్స పొందిన క్షతగాత్రులను పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరికి రూ. 5 లక్షలు, స్వల్పంగా గాయపడ్డ వారికి రూ. 2లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు.

ఈ తొక్కిసలాటలో పోలీసు, అధికారుల వైఫల్యం ఉందంటూ ఎస్పీ సుబ్బరాయుడుతో పాటు డీఎస్పీని, గోశాల అసిస్టెంట్‌ను డైరెక్టర్‌ను అక్కడి నుంచి బదిలీ చేశారు. టీటీడీ పాలక మండలికి కూడా ముఖ్యమంత్రి చివాట్లు పెట్టిన విషయం తెలిసిందే .

# పోలీసులను దూషించిన వైసీపీ మాజీ మంత్రి కాకాణిపై కేసు



అమరావతి : ఏపీ పోలీసులను దూషించిన కేసులో వైసీపీ మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డిపై నెల్లూరు జిల్లా కావలి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల బోగోలు మండలం కోళ్లదిన్నె లో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇరువర్గాల వారూ గాయపడడంతో వారిని కావలి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలోనే వైసీపీ శ్రేణులు మరోసారి కత్తులతో రెచ్చిపోయారు. వైసీపీ నేతలను పరామర్శించేందుకు ఆస్పత్రి వద్దకు వచ్చిన కాకాణి గోవర్దన్ రెడ్డి పోలీసులు, టీడీపీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. టీడీపీ శ్రేణులు తమ కార్యకర్తలపై దాడులు చేస్తుంటే పోలీసులు సహకరిస్తున్నారని కాకాణి ఆరోపించారు.

ఏపీలో వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని, పోలీసు అధికారులు సప్తసముద్రాల అవతల ఉన్నా తీసుకొచ్చి బట్టలూడదీస్తామంటూ తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. టీడీపీ వారినీ వదిలేది లేదంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగారు. ఈ వ్యాఖ్యలపై టీడీపీ నేత వంటేరు ప్రసన్న వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కాకాణిపై 224, 351/2, 352, 353/2 సెక్షన్ల కింది కేసులు నమోదు చేశారు.

# ముగ్గురు సీఎంల రౌండ్ టేబుల్ భేటీ

మొదటి పేజీ తరువాయి

అలాగే దేశం, రాష్ట్రాల అభివృద్ధి దృష్టికోణం, సంక్షేమం, ఆర్థిక వ్యవస్థ, ఇన్నోవేషన్, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ), డిస్రప్షన్, స్థిరత్వం, ఉద్యోగ కల్పన, భవిష్యత్తు దిశలపై మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రౌండ్ టేబుల్ మీటింగ్‌లో చర్చించినట్లు అధికారులు తెలిపారు.

అత్యధిక పెట్టుబడులను రాబట్టడమే లక్ష్యంతో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దావోస్‌లో పర్యటిస్తున్నారు. ఇప్పటికే పలు కంపెనీలు ఏపీ, తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలతో ఆ కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అటు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సైతం తమ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు దావోస్‌లో శాయశక్తులా కృషిచేస్తున్నారు.




# మహారాష్ట్రలో ఘోర రైలు ప్రమాదం

## 8 మంది మృతి, 40 మందికిపైగా గాయాలు



మహారాష్ట్రలో మరో రైలు దుర్ఘటన జరిగింది. జల్‌గావ్ జిల్లాలోని పరండా రైల్వే స్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నో నుంచి మహారాష్ట్రలోని ముంబైకి ప్రయాణిస్తున్న పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగాయని ప్రయాణికులు కేకలు పెట్టారు. దీంతో కొందరు ప్రయాణికులకు భయంతో పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు చైన్ లాగారు. రైలు ఆగకముందే ప్రయాణిస్తుండగానే.. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రయాణికులు కిందికి దూకారు. ఈ క్రమంలోనే పక్కనే ఉన్న పట్టాలపై పడిపోయారు. ఆ సమయంలోనే అటు వైపు నుంచి కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు అతివేగంగా దూసుకురాగా.. దాని కింద పడి పలువురు ప్రయాణికులు దుర్మరణం పాలయ్యారు.

అయితే పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగలేదని.. అవన్నీ పుకార్లేనని తెలుస్తోంది. ప్రయాణికులు అనవసరంగా భయపడటంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ప్రాథమికంగా గుర్తించారు. పట్టాలపై పడిన ప్రయాణికులను కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో వారి మృతదేహాలు ఛిద్రం అయిపోయాయి. వారి తల మొండం వేరు కావడం.. తలలు కూడా రెండు ముక్కలు అయ్యాయి. ఘటనా స్థలంలో ఉన్న కొందరు వీటికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అక్కడి భీతావహ పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం అవుతోంది.

ఇప్పటివరకు ఈ ఘోర రైలు ప్రమాదంలో 8 మంది ప్రయాణికులు మృతి చెందగా.. 40 మందికిపైగా గాయపడినట్లు గుర్తించారు. అయితే మృతుల సంఖ్య, గాయపడిన వారి సంఖ్య ఇంకా భారీగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇక రైలు ప్రమాదానికి సమాచారం అందుకున్న అధికారులు, రెస్క్యూ సిబ్బంది.. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను గుర్తించే పనిలో పడ్డారు.

ఈ రైలు ప్రమాద ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశాలు జారీ చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు సీఎం యోగి సంతాపం తెలిపారు.

# బీజేపీకి మద్దతు

## ఉపసంహరించుకున్న బీహార్ సీఎం

బీజేపీ కి బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ షాకిచ్చారు. ఏడాదిన్నరగా జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్ లో బీజేపీ నేతృత్వంలోని బీరెన్ సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారు. ఆ రాష్ట్రంలో జేడీయూకి కేవలం ఒకే ఒక్క ఎమ్మెల్యే ఉన్నారు. మేఘాలయాలో అధికారంలో ఉన్న కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ సైతం కొన్ని నెలల క్రితమే మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వానికి మద్దతు వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. %చీరా% నిర్ణయం ప్రకటించిన నెలల వ్యవధిలోనే నితీశ్ కుమార్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

కాగా, మణిపూర్‌లో 2022 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ ఆరు స్థానాలను గెలుచుకుంది. ఆ తర్వాత కొన్ని నెలలకే అధికార పార్టీ సంఖ్యను పటిష్టం చేస్తూ ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. దీంతో ప్రస్తుతం అక్కడ జేడీయూకి కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే మిగిలారు. ఇక 60 మంది సభ్యులున్న మణిపూర్ అసెంబ్లీలో ప్రస్తుతం బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఈ నేపథ్యంలో నితీశ్ పార్టీ నిర్ణయంతో బీరెన్ సింగ్ ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపదు. కానీ కేంద్రంలోని బీజేపీకి, బీహార్‌లో జేడీయూ కీలక మిత్రపక్షంగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు బీజేపీకి నితీశ్ కుమార్ మద్దతు ఎందుకు ఉపసంహరించుకున్నారనే విషయంపై స్పష్టతలేదు.



# ప్రభుత్వ పథకాలను సద్వినియోగ చేసుకోవాలి

## అనిశెట్టిపల్లి గ్రామ సభలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్ల సంక్షేమ పథకాల అమలులో భాగంగా నిర్వహించు గ్రామసభలలో రెండవ రోజు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ లక్ష్మీదేవి పల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. గ్రామసభ తీరు, దరఖాస్తు ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి మరియు గ్రామపంచాయతీ సెక్రటరీ నాలుగు సంక్షేమ పథకాల అర్హుల జాబితాను సభకు చదివి వినిపించారు. అర్హుల జాబితాలో వచ్చిన అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయి అన్నారు. ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ గ్రామ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అర్హులకు జాబితాలో పేరు రానివారు ఆందోళన చేయాల్సిన అవసరం లేదని గ్రామ సభలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. గ్రామ సభల నిర్వహణ అర్హులను, అనర్హులను గుర్తించడానికి మరియు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించడానికి అని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు గ్రామ సభలలో కానీ ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీవీ చలపతిరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ సెక్రటరీ మరియు సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## నడికుడ ఉన్నత పాఠశాలలోహనుమకొండ సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం ప్రారంభించిన కలెక్టర్ ప్రావిణ్య




హనుమకొండ, :హనుమకొండ జిల్లా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నడికులలో సివి రామన్ సైన్స్ లాబ్ మరియు సావిత్రిబాయి పూలే గ్రంథాలయాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ఐఏఎస్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. అలాగే పాఠశాలలో పెంచిన కిచెన్ గార్డెను పరిశీలించారు. నడికుడ తహసిల్దార్ నాగరాజు సైన్స్ మెటీరియల్, గ్రంథాలయ పుస్తకాలు స్టేషనరీ, కిచెన్ గార్డెన్ గింజలను (మొత్తం రూపాయలు 15000), సైన్స్ లాబ్లో శాస్త్రవేత్తల ఫ్లెక్సీలు(4500 రూపాయలు) సంపత్ రెడ్డి , గంద్ర రాంరెడ్డి జ్ఞాపకార్థం మార్క సత్యనారాయణ రివాల్వింగ్ చైర్, టేబుల్(8200రూపాయలు) భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు దొంతుల శ్రీనివాసు 2500 రూపాయల విలువగల సైన్స్ కిట్ మెటీరియల్ అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హనుమంతరావు ఎంఈఓ నడికూడ తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం సైన్స్ ప్రయోగాలు చేయాలని, గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని , 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని , కిచెన్ గార్డెన్ ను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు శ్రమ పట్ల అవగాహన పెరుగుతుందని , ఉపాధ్యాయులందరిని మెచ్చుకున్నారు. ఈ సమావేశంలో పదవ తరగతి విద్యార్థులకు కలెక్టర్ ప్రావీణ్య ప్యాడ్స్, కలములు, నోటు పుస్తకాలు, పెన్సిల్‌లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ నారాయణ తాసిల్దార్ నాగరాజు ఉపాధ్యాయులు దొంతుల శ్రీనివాస్, జయ, శివచేతన్, సుమలత, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, పోరిక రాజు నాయక్ తిరుపతి ,సుభాని, శివకుమార్ శారద,అశోక్ , ఉపేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.




## సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు



తొర్రూరు :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఏవో భాస్కర్ అన్నారు. బుధవారం నాంచారి మడూరు గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ గ్రామ సభ నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు స్థానికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏవో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలిచేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్యాం కుమార్, పంచాయతీ కార్యదర్శి బానోతు సతీష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఢీకొండ మధు గౌడ్, మంద నరేందర్ రెడ్డి, బంగారి రమేష్, పింగిలి ఉష, వెంపటి సరోజన, పనికెర ఉపేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నవోదయ లో టెక్ నోవా సైన్స్ ప్రదర్శన

## విద్యార్థులు శాస్త్రవేత్తలు గా ఎదగాలి రామగుండం ఎస్ ఐ...సంధ్యారాణి



రామగుండం, రామగుండం నవోదయ హై స్కూల్లో టెక్నోవ 2025 సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హెడ్ మాస్టర్ తిరుపతి గౌడ్ అధ్యక్షతన ముఖ్య అతిథులుగా కార్పోరేటర్ కన్నూరి సతీష్ కుమార్ ,రామగుండం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సంధ్యారాణి , విశ్వ భారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ ,నోయల్ జోసెఫ్ ,ప్రవీణ్ కుమార్ హాజరై కార్యక్రమం ప్రారంభించారు. ఈ సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో నవోదయ పాఠశాల విద్యార్థులు దాదాపుగా 350 ప్రాజెక్టులకు పైగా ప్రదర్శించి తమలోని నైపుణ్యాలను ప్రదర్శించారు అందులో సైన్సు మ్యా థ్స్ మిగతా అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులో ముఖ్యంగా ఎన్టిపిసి ప్రాజెక్టు , వాటర్ ఫౌంటెన్ , బ్లడ్ టెస్టింగ్ క్యాంప్ ,రాకెట్ లాంచింగ్ క్యాంప్ ,సోలార్ ప్లాంటోరియం,సోలార్ కూలర్ ఇలా అనేక ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కార్పొరేటర్ సతీష్ మాట్లాడుతూ తమ బాల్యం గుర్తుకు వచ్చిందని. పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. ఎస్సై సంధ్యారాణి మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థుల్లో ఆసక్తి నింపినట్లైతే భవిష్యత్తులో విద్యార్థులు మంచి ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు . విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని ,చదువు ఒకటే వారికి పరిపూర్ణత ఇవ్వదని చదువుతోపాటుగా వారికి ఆసక్తి గల నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే వారి బయట సమాజంలో గొప్ప వ్యక్తులుగా ప్రముఖ వ్యక్తులుగా గుర్తింపు పొందే అవకాశం ఉంటుందని, తమ తల్లిదండ్రులు విద్యార్థులను ఈ విషయంలో ప్రోత్సహించాలని సూచించారు. ఈ ప్రదర్శనలను సెయింట్ జోసెఫ్ , విశ్వ భారతి విద్యాసంస్థల విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సందర్శించారు .ఇందులో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతి సాధించిన విద్యార్థులకు చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ హెడ్ మాస్టర్ తిరుపతి గౌడ్ బహుమతులు అందజేశారు.

# నకిలీ ఎక్స్ పీరియన్స్ సర్టిఫికేట్ల ధందా



భద్రాద్రి కొత్తగూడెం :కొత్తగూడెం ఏరియా లోని పద్మావతి ఖని నుండి అండర్ గ్రౌండ్ ఎక్స్పీరియన్స్ సర్టిఫికేట్ పొందినట్టు ఒక సర్టిఫికేట్ వెలుగులోకి వచ్చింది. దీనిని పూర్తి స్థాయిలో విచారణ జరుపగా అది నకిలీ సర్టిఫికేట్ అని నిర్ధారణ అయినది. ఈ యొక్క సర్టిఫికెట్స్ మైనింగ్ డిగ్రీ /డిప్లొమా , స్టాట్యూటరీ పరీక్షల / సర్టిఫికేట్లు పొందుటకు ఉపయోగిస్తారు. ఈ నకిలీ సర్టిఫికెట్స్ పద్మావతి ఖని (PVK. 5 ఇంక్లైన్) గని మేనేజర్ పేరు, ఆఫీసు సీలు, స్టాంప్ మరియు మేనేజర్ ఫోర్జరీ సంతకంతో ఇచ్చినట్లుగా తెలిసినది. కాలేజీలో చదివే విద్యార్థుల అవసరములను పసిగట్టి కొంతమంది ఈ నకిలీ సర్టిఫికెట్ల దందాకు తెరలేపినట్లుగా తెలుస్తోంది. ఈ విషయం పైన కొత్తగూడెం 2వ టౌన్ పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేయటం జరిగినది. ఈ విషయంపై కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ I షాలేం రాజు మాట్లాడుతూ ఇలాంటి నకిలీ సర్టిఫికేట్ల ఆధారంగా స్టాట్యూటరీ పరీక్షలకు అప్లై చేసినట్లయితే అట్టి ధరఖాస్తులను తిరస్కరణకు గురి కావడమే కాకుండా, భవిష్యత్తులో పరీక్షలకు అనర్హులుగా ప్రకటిస్తారు. ఇలాంటి సర్టిఫికేట్లు తీసుకొని మోసపోవద్దని మరియు ఈ విషయమై డిజిఎంఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపినారు.

# ఆరోగ్య క్రాంతి

## సగ్గుబియ్యంతో ఈ సమస్యలు దూరమవుతాయ



హెల్త్ న్యూస్ :సగ్గుబియ్యాన్ని కర్రపెండలం నుంచి తయారు చేస్తారు. ఈ సగ్గబియ్యంలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, విటమిన్ సి, కాల్షియం, మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. ఈ సగ్గుబియ్యంలో ఫోలిక్ యాసిడ్, విటమిన్ బితో పాటు ఐరన్ కాల్షియం, విటమిన్ కెలు కూడా ఉన్నాయి. వీటిని తినడం వల్ల శరీరానికి ఎన్నో లాభాలు ఉన్నాయి.

ఇక సగ్గుబియ్యం తయారీ విషయానికొస్తే కర్రపెండలం పైతొక్కని తీసి క్లీన్ చేసి చెరకు రసం తీసినట్టు పెండలం నుంచి తీస్తే పాల పదార్థం వస్తుంది. దానిని చిక్కగా చేస్తారు. ఈ పిండిని రకరాల పరిమాణంలో రంధ్రాలున్న జల్లెడ లాంటి పాత్రలో వేసి కదుపుతారు. దీంతో తెల్లని పూసల్లా సగ్గ బియ్యం తయారవుతాయి. వీటిని తయారుచేసినప్పుడు మెత్తగా ఉంటాయి. పెద్ద పెనం మీద వేడి చేసి తర్వాత ఎండలో ఆరబెడతారు. ఇలా తయారైన సగ్గుబియ్యాన్ని మనం ఎన్నో రకాలుగా మన డైట్‌లో చేర్చి వాటి రుచిని ఆస్వాదిస్తూ ఆరోగ్య ప్రయోజనాలని పొందుతాం. అవేంటో తెలుసుకోండి.

షుగర్ ఉన్నవారికి

సగ్గుబియ్యంలో పిండి పదార్థం ఎక్కువగా ఉంటుంది. రసాయనాలు, తీపి పదార్థాలు లేకపోవడం వల్ల షుగర్ ఉన్నవారు కూడా హ్యాపీగా తీసుకోవచ్చు. ఇక ఇందులో ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, గర్భిణీలకు ఎంతో మేలు చేస్తుంది. అంతేకాకుండా పుట్టే పిల్లలకి కూడా మంచిది.

ఎముకలు, కండరాల బలానికి

సగ్గుబియ్యంలో కాల్షియం, ఐరన్, విటమిన్ కె వంటివి ఉంటాయి. కాబట్టి, ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. వీటిలోని కాల్షియం రక్తప్రసరణ సక్రమంగా జరిగేందుకు తోడ్పడుతుంది. వీటిలో అమైనో యాసిడ్స్ ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మజిల్స్‌కి బలం, కండరాల సమస్యలు దూరమవుతాయి. ముఖ్యంగా, ప్రోటీన్‌తో కలిపి తీసుకోవడం చాలా మంచిది.

బరువు పెరగడం

మరీ తక్కువ బరువు ఉన్నవారు ఈ సగ్గ బియ్యాన్ని తినడం అలవాటు చేసుకోవాలి. దీంతో మంచి వెయిట్ మెంటెయిన్ చేయొచ్చు. వీటిని ఎక్కువ కేలరీల కంటెంట్ అనారోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకోకుండా ఉండడం మంచిది. వీటితో సరైన రీతిలో బరువు పెరుగుతారు.

రక్తపోటు తగ్గేందుకు

సగ్గుబియ్యం రెగ్యులర్‌గా తీసుకుంటే రక్తపోటు కంట్రోల్ అవుతుంది. గ్లూటెన్ పడనివారు ఈ సగ్గుబియ్యాన్ని హ్యాపీగా తినొచ్చు. దీంతో జీర్ణ సమస్యలు కూడా రావు. వీటిలో డైటరీ ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీంతో జీర్ణ సమస్యలు, మలబద్ధకం తగ్గుతుంది. మంచి హెల్దీ గట్ మెంటెయిన్ అవుతుంది.

ఎనర్జీ

సగ్గ బియ్యాన్నిరెగ్యులర్‌గా తీసుకుంటే మంచి ఫిట్‌నెస్ మీ సొంతమవుతుంది. ఫిట్‌గా మారతారు. వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడం అలవాటు చేసుకోండి. అయితే, మనం తీసుకునే కార్బోహైడ్రేట్స్‌ని దృష్టిలో పెట్టుకోండి. బలహీనంగా ఉన్నవారికి సగ్గుబియ్యం ఇస్తే బలహీనత తగ్గి తక్షణ శక్తి పొందుతారు.

ఎనర్జీ బూస్టర్‌గా


సగ్గుబియ్యంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తాయి. అందుకే, ఉపవాసంలో చాలా మంది వీటితో కిచిడీ, పాయసం చేసి తాగుతారు. దీంతో ఉపవాసంతో అలసిన శరీరానికి అప్పటికప్పుడు ఎనర్జీ అందుతుంది. ఇందులో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, తగిన మోతాదులోనే తీసుకోవాలి.

ఎలా తీసుకోవచ్చు

బ్రేక్‌ఫాస్ట్

సగ్గుబియ్యాన్ని ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకుంటే నెక్స్ట్ మీల్ వరకూ ఎనర్జీగా ఉంటారు. వీటిని మధ్యాహ్నం తీసుకుంటే ఎక్కువగా తినకుండా ఉంటారు.వీటిని వర్కౌట్‌కి ముందు తీసుకుంటే ఎనర్జీగా ఉంటారు. ఎక్సర్‌సైజ్ పర్ఫెక్ట్‌గా చేస్తారు.

## శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని కరిగించి గుండెకి బలాన్ని ఇచ్చే ఆహారాలు



హెల్త్ న్యూస్ :ఈ రోజుల్లో చాలా మంది లైఫ్ స్టైల్ మీద ఎక్కువగా ఫోకస్ పెట్టడం లేదు. ఉరుకుల పరుగుల జీవితంలో ఓ పక్కా ప్రణాళిక లేకుండా బతికేస్తున్నారు. సరైన టైంలో తినకపోవడం, జంక్ ఫుడ్ తినడం, స్మోకింగ్, డ్రింకింగ్ ఇలా ఓ పద్ధతి లేకుండా జీవిస్తున్నారు. దీంతో.. చాలా ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. అందులో ముఖ్యంగా ప్రపంచం మొత్తాన్ని భయపెడుతున్న ఓ అంశం ఒకటి ఉంది. అదే గుండెపోటు . ఈ రోజుల్లో చాలా మంది గుండె పోటుతో ఆకస్మాత్తుగా చనిపోతున్నారు. యువత కూడా గుండె పోటు బారిన పడుతున్నారు.

గుండె జబ్బులకు చెక్ పెట్టాలంటే మన జీవన శైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలి. తినే ఆహారం నుంచి చేసే పనుల వరకు కొన్ని మార్పులు చేసుకుంటేనే గుండె బలంగా ఉంటుంది. లేదంటే మహమ్మారి బారిన పడక తప్పదు. ముఖ్యంగా తినే ఆహారంపై దృష్టి పెట్టాలి. కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలి. కొన్ని ఫుడ్స్‌ను డైట్‌లో భాగం చేసుకోవాలి. మొక్కల ఆధారిత ఆహారాలు, నట్స్, కూరగాయలు, పండ్లు వంటి వాటిని తింటే గుండె బలంగా మారుతుంది. ఎలాంటి ఆహారాలు గుండెకు మేలు చేస్తాయో ఇక్కడ తెలుసుకుందాం.

గింజలు, విత్తనాలు

వీటిలో అసంతృప్త కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు, కొవ్వులు ఎక్కువగా ఉన్నాయి. వీటిని తింటే గుండెకు ఎంతో మేలు జరుగుతుంది. వీటిని తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిల్ని కరిగించి.. గుండెకు మేలు చేస్తాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గితే గుండె సమస్యల ముప్పు తగ్గుతుంది. అందుకే మీ ఆహారంలో బాదం, పిస్తా, వాల్ నట్స్, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు విత్తనాలు వంటి వాటిని భాగం చేసుకోవాలి.

బీన్స్

అనేక ఆరోగ్య సమస్యలకి కారణమయ్యే చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించే శక్తి బీన్స్‌లో పుష్కలంగా ఉంది. ఇందులో ఎక్కువగా పోషకాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. బీన్స్, కాయధాన్యాలు, శనగల్లో ప్రొటీన్, ఫైబర్, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. చిక్కుళ్లను తరచూ మన ఆహారంలో చేర్చుకుంటే.. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

పండ్లు

పండ్లలో ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. అందుకే పండ్లను సలాడ్, జ్యూస్ రూపంలో తీసుకుంటారు. తాజా పండ్లు ఖనిజాలు, ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఈ పోషకాలు శరీరంలో ఇన్ఫ్లమేషన్ లెవల్స్ తగ్గించడంలో సాయపడతాయి. అంతేకాకుండా హైపర్ టెన్షన్‌ను దరిచేరినివ్వవు. పండ్లను ఆహారంలో ఎక్కువగా తీసుకుంటే.. గుండె సమస్యల ముప్పు తగ్గుతుంది.

కూరగాయలు, ఆకుకూరలు

కూరగాయలు, ఆకుకూరల్లో ఎన్నో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పాలకూర, బ్రకోలి, మెంతి కూర, పచ్చి మిరపకాయలు, బ్రస్సెల్స్ మొలకలు, కాలే వంటి ఆకుకూరలు, కాయగూరల్లో ఐరన్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కెతో పాటు మరెన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించడమే కాకుండా ఇన్ఫ్లమేషన్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తాయి. వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యం మెరగవుతుంది. తాజా కూరగాయలు, ఆకుకూరలు గుండెకు ఎంతో మేలు చేస్తాయి.

బెర్రీలు

బ్లూబెర్రీస్, రాస్ప్బెర్రీస్, బ్లాక్బెర్రీస్, బ్లూ బెర్రీస్ అన్నీ బెర్రీ జాతికి చెందిన పండ్లు. వీటిలో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. వీటిలో ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కె, మాంగనీస్, యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. అంతేకాకుండా వాటర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. కేలరీస్ కూడా తక్కువే. దీంతో వీటిని తీసుకోవడం వల్ల గుండె సమస్యలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. బెర్రీల్ని తాజాగా తింటే ఎక్కువ ప్రయోజనాలు అందుతాయని నిపుణులు చెబుతున్నారు.

తృణధాన్యాలు

తృణధాన్యాలు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వీటిలో ఎన్నో మంచి ఔషధ గుణాలు ఉంటాయి. పౌష్టిక విలువలు అధికం. ఓట్స్, బ్రౌన్ రైస్, క్వినోవా, అవిసెలు, ఉల్వాలు, సజ్జలు వంటి తృణధాన్యాల్లో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇవి రక్తంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా నిరోధిస్తాయి. వీటిని తినడం వల్ల గుండెకు ఎంతో మేలు జరుగుతుంది. వీటిలో ఉండే ఫైబర్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

# అదరగొట్టిన అభిషేక్ శర్మ.. తొలి టీ20లో భారత్ ఘన విజయం




స్పోర్ట్స్ న్యూస్ : ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో పర్యాటక ఇంగ్లాండ్‌ను చిత్తు చేసి.. విజయంతో సిరీస్‌ను ప్రారంభించింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో యువ భారత్ ఘన విజయం సాధించింది. తొలుత ఇంగ్లాండ్‌ను 132 పరుగులకే కుప్పకూల్చిన భారత్.. అనంతరం ఆ లక్ష్యాన్ని 13 ఓవర్లలోపే ఛేదించింది. దీంతో సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అభిషేక్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. కోల్‌కతాలో భారత్‌కు ఇది వరుసగా 7వ టీ20 విజయం కావడం విశేషం. ఇంకొక విజయం సాధిస్తే, ఇంగ్లాండ్‌తో కలిసి అగ్రస్థానంలో నిలుస్తుంది . ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్.. భారత బౌలర్ల ధాటికి బెంబేలెత్తిపోయింది. ఓ వైపు అర్షదీప్ సింగ్.. మరోవైపు వరుణ్ చక్రవర్తి ధాటికి.. వరుసగా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్ (0), బెన్ డకెట్ (4)ను అర్షదీప్ పెవిలియన్ పంపించగా.. మిడిల్ ఆర్డర్ బ్యాటర్లను వెనక్కి పంపే బాధ్యత వరుణ్ చక్రవర్తి తీసుకున్నాడు. దీంతో ఆ జట్టు స్కోరు బోర్డు నెమ్మదిగా సాగింది. అయితే కెప్టెన్ జోస్ బట్లర్ (44 బంతుల్లో 68 రన్స్) ఒంటరి పోరాటంతో ఇంగ్లాండ్ 20 ఓవర్లు బ్యాటింగ్ చేసింది. సరిగ్గా 20 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయింది.

భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 3 వికెట్లతో సత్తా చాటాడు. అర్షదీప్ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌లు తలా రెండు వికెట్లు చొప్పున పడగొట్టారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు.. సంజూ శాంసన్, అభిషేక్ శర్మల జోడీ శుభారంభం ఇచ్చింది. ముఖ్యంగా సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. గస్ అట్కిన్‌సన్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో 4 ఫోర్లు, ఒక సిక్స్‌తో ఏకంగా 22 రన్స్ రాబట్టాడు. ఆ తర్వాత అభిషేక్ శర్మ కూడా జోరందుకోవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. 20 బంతుల్లో 26 రన్స్ చేసిన తర్వాత సంజూ ఔట్ అయ్యాడు. ఆ తర్వాత కాసేపటికే సూర్యకుమార్ యాదవ్ (0) కూడా వెనుదిరిగాడు.

ఈ దశలో తిలక్ వర్మ (16 బంతుల్లో 19 నాటౌట్)తో కలిసి అభిషేక్ శర్మ విధ్వంసం సృష్టించాడు. 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్కు అందుకున్నాడు. ఆ తర్వాత కూడా 200లకు పైగా స్ట్రైక్ రేట్‌తో పరుగులు రాబట్టాడు. 34 బంతుల్లో 79 రన్స్ చేసిన తర్వాత అతడు ఔట్ అయ్యాడు. అయితే అప్పటికే మ్యాచ్ భారత్ చేతుల్లోకి వచ్చేసింది.ఆ తర్వాత హార్దిక్ పాండ్యా (3), తిలక్ వర్మలు లాంఛనాన్ని పూర్తి చేశారు. 12.5 ఓవర్లలో భారత్ 3 వికెట్లు కోల్పోయి 133 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో టీ20 మ్యాచ్‌లో ఈనెల 25న చెన్నై వేదికగా జరగనుంది.

# అర్షదీప్ సింగ్ అదరహో..

స్పోర్ట్స్ న్యూస్ : టీమిండియా యువ పేసర్, టీ20 స్పెషలిస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ చరిత్ర సృష్టించాడు. టీ20ల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. అతి తక్కువ కాలంలో ఈ ఫీట్ సాధించిన ప్లేయర్‌గా నిలిచాడు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టీ20 మ్యాచ్‌లో బెన్ డకెట్‌ను ఔట్ చేసిన అర్షదీప్ సింగ్.. ఈ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఈ క్రమంలోనే యుజ్వేంద్ర చాహల్‌ను బీట్ చేశాడు. 2022 జూలైలో భారత్ తరఫున టీ20ల్లో అరంగేట్రం చేసిన ఈ ప్లేయర్. అనతికాలంలోనే నమ్మదగ్గ బౌలర్‌గా మారిపోయాడు. కొత్త బంతితో వికెట్లు తీస్తూ.. చివర్లో పరుగులు కట్టడి చేస్తూ.. ప్రత్యర్థులకు కళ్లెం వేస్తున్నాడు. ఈ క్రమంలోనే భారత్ తరఫున టీ20లలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు అర్షదీప్. ఇంగ్లాండ్‌తో తొలి టీ20 మ్యాచ్‌లో బెన్ డకెట్ వికెట్ తీసిన ఈ ప్లేయర్.. 97వ వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. అతడు కేవలం 61 టీ20 మ్యాచ్‌లోలనే ఈ ఫీట్ సాధించాడు. అంతకుముందు ఈ రికార్డు.. యుజ్వేంద్ర చాహల్ పేరిట ఉంది. స్పిన్నర్ చాహల్ 80 మ్యాచ్‌ల్లో 96 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్‌తో తొలి టీ20 ద్వారా అర్షదీప్ సింగ్.. చాహల్‌ను అధిగమించాడు.




టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్లు:

- అర్షదీప్ సింగ్ – 97 వికెట్లు (61 మ్యాచ్‌లు)
- యుజ్వేంద్ర చాహల్ – 96 వికెట్లు (80 మ్యాచ్‌లు)
- భువనేశ్వర్ కుమార్ – 90 వికెట్లు (87 మ్యాచ్‌లు)
- జస్ప్రీత్ బుమ్రా – 89 వికెట్లు (70 మ్యాచ్‌లు)
- హార్దిక్ పాండ్యా – 89 వికెట్లు (110 మ్యాచ్‌లు)

# పాక్ పేరు తొలగించాలని కోరలేదు.. బీసీసీఐ బిగ్ రివీల్

స్పోర్ట్స్ న్యూస్ :పాకిస్థాన్ వేదికగా ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు ఛాంపియన్స్ ట్రోఫీ 2025 జరగనున్న విషయం తెలిసిందే. ఈ టోర్నీ హైబ్రిడ్ మోడల్‌లో జరగనుంది. భారత్ ఆడే మ్యాచ్‌లు యూఏఈ వేదికగా జరగనున్నాయి. మిగతా మ్యాచ్‌లన్నీ పాక్‌లోనే జరుగుతాయి. ఈ టోర్నీకి ఆతిథ్య దేశంగా పాకిస్థాన్ ఉంది. అయితే, సాధారణంగా ఐసీసీ టోర్నీల్లో పాల్గొనే జట్ల జెర్సీలపై ఆతిథ్య దేశాల పేర్లను ముద్రిస్తారు. కానీ, ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి భారత జెర్సీలపై పాకిస్థాన్ పేరును తొలగించాలంటూ బీసీసీఐ డిమాండ్ చేసిందని ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై బీసీసీఐ స్పందించింది.





అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉంటామని బీసీసీఐ స్పష్టం చేసింది. భారత జెర్సీలపై పాకిస్థాన్ పేరు తొలగించాలని తాము డిమాండ్ చేయలేదని వెల్లడించింది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. 'ఐసీసీ టోర్నమెంట్ సమయంలో ఏ క్రికెట్ బోర్డు అయినా, భారత జట్టు అయినా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఆదేశాలకు కట్టుబడే ఉంటాయి. ఐసీసీ ఆదేశాలను ఉల్లంఘించాలని మేము అనుకోవడం లేదు. ఛాంపియన్స్ ట్రోఫీ జెర్సీలపై పాకిస్థాన్ పేరును తొలగించాలని మేం ఎలాంటి డిమాండ్ చేయాలేదు. జెర్సీలపై ఉండే ట్రోఫీకి సంబంధించిన లోగోలో తమ దేశం పేరు ఉండేందుకు ఆతిథ్య దేశమైన పాకిస్థాన్‌కు హక్కు ఉంటుంది' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వివరణ ఇచ్చాడు. వాస్తవానికి పాకిస్థాన్ పేరు తొలగించాలని బీసీసీఐ.. ఐసీసీని కోరినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అభ్యంతరం తెలిపినట్లు ఆ వార్తల్లో పేర్కొన్నారు. కానీ, బీసీసీఐ వివరణతో అవన్నీ అబద్ధాలేనని తేలిపోయాయి.

ఇక ఇతర ఐసీసీ ట్రోఫీలో మాదిరిగానే ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు కూడా ఈ టోర్నీలో ఆడే దేశాల కెప్టెన్‌లతో సమావేశం, ఫొటో షూట్ ఉంటుంది. ఛాంపియన్స్ ట్రోఫీ ఫొటోషూట్ లాహోర్‌లో జరగాల్సి ఉంది. అయితే, ఈ ఫొటో షూట్ కోసం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పాకిస్థాన్‌కు వెళతాడా..? లేదా..? అనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని బీసీసీఐ తెలిపింది. ఈ విషయంపై చర్చలు జరుగుతున్నట్లు పేర్కొంది.


# అలా చేసుంటే.. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికయ్యేవాడిని: సూర్యకుమార్ యాదవ్




స్పోర్ట్స్ న్యూస్ :పాకిస్థాన్ వేదికగా వచ్చే నెలలో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భారత టీ20 కెప్టెన్, మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్‌కు చోటు దక్కలేదు. దీనిపై సురేశ్ రైనా సహా పలువురు భారత మాజీ క్రికెటర్లు.. పెదవి విరిచారు. అతడు ఛాంపియన్స్ ట్రోఫీలో ఎక్స్ ఫ్యాక్టర్‌గా పనిచేస్తాడని అభిప్రాయం వ్యక్తం చేశారు. అతడిని ఎంపిక చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇంగ్లాండ్‌తో తొలి టీ20 మ్యాచ్‌కు ముందు ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సూర్యకుమార్ ఈ విషయంపై స్పందించాడు.భారత వన్డే జట్టులో తనకు చోటు దక్కకపోవడంపై తానేమీ బాధపడలేదని సూర్యకుమార్ చెప్పుకొచ్చాడు. తాను బాగా రాణించి ఉంటే.. జట్టులో ఉండేవాడినని వ్యాఖ్యానించాడు. 'ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో చోటు దక్కకపోవడంపై నేనేమీ బాధ పడటంలేదు. వన్డే ఫార్మాట్‌లో బాగా రాణించి ఉంటే ఈ జట్టులో ఉండేవాడిని. కానీ, ఆశించిన స్థాయిలో రాణించలేకపోయా. అందుకే నాకు అవకాశం దక్కలేదు. ఎప్పుడైనా మన తప్పిదాన్ని అంగీకరించడం ముఖ్యం. అయితే నాకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోలేకపోయినందుకు మాత్రం బాధగా ఉంది. అదే నేను బాగా ఆడి ఉంటే, వన్డే జట్టులో కచ్చితంగా కొనసాగి ఉండేవాడిని' అని సూర్యకుమార్ యాదవ్ తన మనసులోని మాటను చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసిన భారత జట్టు చాలా బాగుంది. టీమ్‌లోని వారంతా అద్భుతమైన ఆటగాళ్లు. వన్డే ఫార్మాట్‌లో భారత్ తరఫున మెరుగైన ప్రదర్శన చేశారు. వారందరూ జట్టులో ఉండాల్సిన వారే" అని సూర్యకుమార్ పేర్కొన్నాడు. టీ20లతో పోలిస్తే.. వన్డే ఫార్మాట్‌లో సూర్యకుమార్ ఆశించిన మేర రాణించలేకపోయాడు. 37 వన్డేలు ఆడిన సూర్య.. 25 సగటుతో 736 పరుగులు చేశాడు. టీ20ల్లో 74 ఇన్నింగ్స్‌లలో 40 సగటుతో 1531 రన్స్ స్కోరు చేశాడు. తనకు వచ్చిన అవకాశాలను సూర్యకుమార్ సద్వినియోగం చేసుకోకపోవడంతో.. అతడిని వన్డే ఫార్మాట్‌కు సెలక్టర్లు పక్కన పెట్టారు. దీంతో టీ20ల్లో భారత జట్టు రెగ్యులర్ కెప్టెన్‌గా ఉన్నప్పటికి.. వన్డేలకు మాత్రం మిస్టర్ 360ని పరిగణలోకి తీసుకోలేదు.




# ఓటీటీల వలనే సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయి : అక్షయ్ కుమార్



మూవీ న్యూస్,బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఓటీటీ లపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. థియేటర్‌లో వచ్చే సినిమాలు ఓటీటీ (ఓవర్ ది టాప్)ల వలనే ఫ్లాప్ అవుతున్నాయని తెలిపాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'స్కై ఫోర్స్'. ఈ సినిమాతో వీర్ పహరియా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తుండగా.. సందీప్ కెవ్లానీ, అభిషేక్ కపూర్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమాను రిపబ్లిక్ డే కానుకగా జనవరి 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. భారత దేశ మొదటి వైమానిక దాడి ఆధారంగా ఈ సినిమా రూపొందగా.. ఇందులో సారా అలీ ఖాన్, నిమ్రత్ కౌర్ కీలక పాత్రలు పోషించారు. జియో స్టూడియోస్, మడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌లపై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మించాడు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. ఇండియన్ సినిమా ప్రస్తుతం ఎందుకు ఇంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది?.. ఎందుకు సక్సెస్ రేట్ ఎందుకు ఇంత తక్కువగా ఉందని మీడియా అక్షయ్‌ని ప్రశ్నించగా.. అక్షయ్ సమాధానమిస్తూ.. ఓటీటీల వలనే సినిమాలు థియేటర్‌లో ఆడకుండా ఫ్లాప్ అవుతున్నాయని వెల్లడించాడు.నేను ఈ మధ్య కొంతమందిని కలిసినప్పుడు వారితో సినిమాల గురించి మాట్లాడాను. అయితే వారు సినిమాలు థియేటర్‌లో కాకుండా ఓటీటీలో చూస్తున్నాం అని చెబుతున్నారు. ఒక సినిమా బాక్సాఫీస్ దగ్గర రన్ అవ్వకుండా ఫ్లాప్ అవ్వడానికి ఇదే ముఖ్య కారణం. కరోనా వేవ్ తర్వాత కూడా ఓటీటీలకు అలవాటైన ప్రేక్షకులు ఇప్పుడు థియేటర్‌కి రావడం క్రమంగా తగ్గించారు. ఈ మధ్య ఈ అలవాటు బాగా పెరిగింది అని తెలిపాడు. ప్రేక్షకులు కూడా ఈ మధ్య సెలక్టివ్‌గా సినిమాలు చూస్తున్నారు. వారికి సినిమా నచ్చితేనే థియేటర్‌కి వెళుతున్నారు. లేకుంటే అదే సినిమాను ఓటీటీలో వచ్చే వరకు వెయిట్ చేసి చూస్తున్నారు అంటూ అక్షయ్ చెప్పుకోచ్చాడు.

# జయలలిత బయోపిక్.. ఆ కారణంతోనే చేయలేకపోయా : నిత్య మీనన్



మూవీ న్యూస్ :దిగ్గజ నటి, దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత  బయోపిక్‌లో నేషనల్ అవార్డు విన్నర్ నిత్య మీనన్ నటించబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 'ది ఐరెన్ లేడీ'  పేరుతో ప్రియదర్శని అనే దర్శకురాలు ఈ సినిమాను తెరకెక్కించున్నట్లు మేకర్స్ తెలిపారు. దీనికి సంబంధించి ఫస్ట్ లుక్‌ని కూడా విడుదల చేసింది చిత్రబృందం. అయితే అనుకొని కారణాల వలన ఈ ప్రాజెక్ట్ మధ్యలోనే ఆగిపోయింది. కాగా ఈ చిత్రం ఆగిపోవడానికి గల కారణాన్ని తాజాగా వెల్లడించింది నటి నిత్య. తలైవి జయలలిత బయోపిక్ చేయాలని మేం ఎంతో ఆశపడ్డాం. దీనికి సంబంధించి నా ఫస్ట్ లుక్ కూడా చిత్రబృందం విడుదల చేసింది. అయితే మా సినిమా ప్రకటించిన వెంటనే 'తలైవి' అని సినిమా వచ్చింది. కంగనా రనౌత్ నటించిన ఈ చిత్రం నేరుగా థియేటర్లలోనే విడుదలయ్యింది. అయితే ఈ సినిమా వచ్చాక మేం కూడా అదే కథతో వస్తే రిపీటవుతుంది కదా అని సందేహించాం. కానీ మా నాన్న మాత్రం జయలలిత బయోపిక్‌లో కచ్చితంగా నటించమని అడిగారు. ఈ క్రమంలోనే ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా.. రమ్య కృష్ణ క్వీన్ అంటూ జయలలిత బయోపిక్ వెబ్ సిరీస్ వచ్చింది. దీంతో ఒకే కథతో ఇప్పటికే రెండు సినిమాలు వచ్చాక.. మేం కూడా చేస్తే కచ్చింతంగా రిపీట్ అవుతుందని అనుకుని ఈ ప్రాజెక్ట్‌ని మధ్యలోనే ఆపేశాం అంటూ నిత్య మీనన్ వెల్లడించింది.

# వీల్‌చైర్‌లో రష్మిక మందన్న..

## నడవలేని స్థితిలో ఎయిర్‌పోర్టు లోపలకి



మూవీ న్యూస్, :హీరోయిన్ రష్మిక మందన్న జిమ్‌లో వర్కవుట్ చేస్తూ కాలికి బలమైన గాయమైన విషయం తెలిసిందే. తగిలిన గాయంతో రష్మిక తెగ ఇబ్బంది పడుతూ ఇవాళ ఉదయం (జనవరి 22న) ముంబై బయలుదేరింది.రష్మిక హైదరాబాద్ విమానాశ్రయంలో కార్ లో నుండి దిగి వీల్‌చైర్‌లో వెళ్తున్న వీడియో బయటికి వచ్చింది. ఇందులో రష్మిక ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తర్వాత, కారు దిగేందుకు ఇబ్బంది పడుతున్నట్లు వీడియోలో కనిపించింది. అలాగే ఆమె కుంటుతూ, తన టీమ్ మద్దతును తీసుకుని వీల్‌చైర్‌లో కూర్చుంది. అలా తోటివారి సహాయంతో ఎయిర్‌పోర్టు లోపలికి వెళు తున్నవీడియో వైరల్ అవ్వడంతో రష్మిక ఫ్యాన్స్ స్పందిస్తున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా ద్వారా పోస్టులు పెడుతున్నారు.రష్మిక నుంచి రాబోయే బాలీవుడ్ హిస్టారికల్ మూవీ ఛావా. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ కోసం ముంబై బయలుదేరింది రష్మిక. ఈ క్రమంలో హైదరాబాద్ విమానాశ్రయంలో వీల్ చైర్‌లో కనిపించింది. అయితే, ఆమె గాయంతో బాధపడుతున్నప్పటికీ, తన సినిమా ప్రమోషన్స్ కోసం ఈవెంట్‌కు వెళు తుండటంతో తనకు సినిమాపై ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తుంది.

# రాంచరణ్ ఆర్‌సీ 16 టైటిల్ ఇదేనట..




మూవీ న్యూస్:టాలీవుడ్ స్టార్ హీరో రాంచరణ్ప్రస్తుతం రెండు సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన డైరెక్షన్‌లో చేస్తున్న ఆర్‌సీ 16 సినిమా కాగా.. మరొకటి సుకుమార్ డైరెక్షన్‌లో రాబోతున్న ఆర్‌సీ 17 ప్రాజెక్ట్. ప్రస్తుతానికి అభిమానులు, మూవీ లవర్స్ ఫోకస్ అంతా బుచ్చి బాబు డైరెక్షన్‌లో చేస్తున్న సినిమాపైనే ఉంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా మూడో షెడ్యూల్ జనవరి 27 నుంచి హైదరాబాద్‌లో మొదలు కానుందని వార్తలు కూడా వచ్చాయి.

తాజాగా బుచ్చిబాబు టీం ఈ సినిమాకు PEDDI అనే టైటిల్‌ను ఫిక్స్ చేసిందని ఫిలింనగర్ సర్కిల్‌లో ఓ వార్త రౌండప్ చేస్తోంది. త్వరలోనే అధికారికంగా టైటిల్ అనౌన్స్‌మెంట్ ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఇదే నిజమైతే స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమాకు ఫిక్స్ చేసిన టైటిల్ ఆసక్తిని పెంచుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. జాన్వీకపూర్‌కు దేవర తర్వాత తెలుగులో ఇది రెండో సినిమా. ఆర్‌సీ 16 షూటింగ్‌ను జులైకల్లా పూర్తి చేసి.. దసరా లేదా డిసెంబర్ మొదటి వారంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు రెడీ అవుతున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి తంగలాన్ ఫేం ఏగన్ ఏకాంబరం కాస్ట్యూమ్ డిజైనర్ పనిచేస్తున్నాడు.

ఈ చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్-మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తున్నాడు.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com